ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 31.0 కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY

3



శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు

శనివారం 2 ఆగస్టు 2025

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

హిందూపురం, మడకశిర, పెనుకొండ :9985445760
ధర్మవరం, పుట్టపర్తి : 9963160529
కదిరి :9052518170
ఏసీఎమ్: 9985411154

వడ్డీ వ్యాపారులపై పీడీ యాక్ట్

● మంత్రి సత్యకుమార్ యాదవ్



అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అప్పులు ఇచ్చి, వడ్డీల పేరుతో వేధించే వారిపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేయిస్తామని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ హెచ్చరించారు. పట్టణంలోని ఏడో వార్డులో శుక్రవారం ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. రూ.60లక్షల మున్సిపాలిటీ నిధులతో చేపట్టిన డ్రైనేజీ, సీసీరోడ్లు, పైపులైన్ల నిర్మాణాలకు జనసేన నాయకుడు చిలకం మధుసూదన్‌రెడ్డితో కలిసి శంకుస్థాపనలు చేశారు. అనంతరం పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఏడో వార్డులో ఎన్నో ఏళ్లుగా వేధిస్తున్న అపరిశుభ్రత, కనెక్టివిటీ వంటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. నిర్మాణాలు నాణ్యతగా ఉండాలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు. ధర్మవరం లో అధికవడ్డీ వసూళు చేసి, పేద ప్రజలను వేధిస్తున్న వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్ అంబటి అరుణశ్రీ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబులేసు, పట్టణ అధ్యక్షుడు జింకా చంద్ర, రూరల్ అధ్య క్షుడు గొట్లూరు చంద్ర, 7వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పల్లపు రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

భద్రత డొల్ల

● పనిచేయని సైరన్‌లు, సీసీ కెమెరాలు
● సెక్యూరిటీ గార్డులను పెట్టని బ్యాంకర్లు
● నిర్లక్ష్యం ఖరీదు.. రూ.10 కోట్ల బంగారం



బ్యాంక్ అధికారులతో సమీక్ష జరుపుతున్న సీఐ

హిందూపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తూమకుంట ఎస్‌బీఐలో దోపిడీ అనంతరం ఇతర బ్యాంకుల్లో భద్రతపై చర్చ మొదలైంది. హిందూపురం ప్రాంతంలో బ్యాంకుల్లో చోరీ ఇదే మొదటిసారి. ఏటీఎంలను మాత్రమే దొంగలు టార్గెట్ చేశారు. తాజా ఘటన తరువాత బ్యాంకుల్లో భద్రతపై పోలీసులు దృష్టి పెట్టారు. అరకేజీ కేజీ వరకు బంగారం దాచిపెట్టిన గదులే ఎంతో భద్రంగా ఉంటాయి. కానీ బ్యాంకుల్లో కిలోలకు కిలోల బంగారం ఉంటుంది. వీటిని భద్రపరిచే గదులు పేరుకు స్ట్రాంగ్ రూమ్‌లు. కానీ గదులు అలా లేవని తేలిపోయింది. ఆభరణాలను దాచే ఐరన్ లాకర్‌లతోపాటు, వాటిని ఉంచే గదులు కూడా భద్రంగా ఉండాలి. తలుపులు మరింత భద్రంగా ఉండాలి. కానీ విరిస్తే విరిగేలా కిటికీల కడ్డీలు ఉన్నాయి. మరికొన్ని బ్యాంకుల్లో మరుగుదొడ్ల నుంచి కూడా లోనికి వెళ్లే మార్గాలు ఉన్నాయి. బ్యాంకులలో డొల్లతనాన్ని చూసిన పోలీసులు అవాక్కవుతున్నారు. ఇంత నిర్లక్ష్యంగా ఎలా ఉన్నారని ప్రశ్నిస్తున్నారు.

జీతం ఇవ్వలేకనా?

ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు తప్పనిసరిగా వాచ్‌మెన్‌లను నియమించుకుంటున్నాయి. వారు రేయింబవళ్లు కాపలాగా ఉంటారు. కానీ బ్యాంకుల వద్ద ఆ ఏర్పాట్లు లేవు. రాత్రిళ్లు ఎవరూ ఉండటం లేదు. సెక్యూరిటీ గార్డులకు జీతం ఇవ్వలేక ఇలా భద్రతను గాలికి వదిలేశారు. సీసీ కెమెరాలు పెట్టామని, వాచ్‌మెన్‌తో పనిలేదని అంటున్నారు. కానీ సీసీ కెమెరాలు ఉన్నా చోరీ జరిగింది. ఓ ప్రముఖ బ్యాంకు దేశ వ్యాప్తంగా వాచ్‌మెన్‌ను తొలగించినట్లు సమాచారం. ప్రతి బ్యాంకులో సైరన్ ఉంటుంది. ఎవరైనా రాత్రిపూట సైరన్‌కు దగ్గరగా వెళ్లినా, తలుపులు తాకినా మోగుతుంది. దీంతో చుట్టుపక్కలవారు అలర్ట్ అవ్వడానికి ఆస్కారం ఉంటుంది. కానీ కొన్ని బ్యాంకులలో సైరన్‌లు, సీసీ కెమెరాలు చెడిపోయాయి. వాటిని మరమ్మతు చేయించలేదు. తూమకుంట బ్రాంచిలో ఏడాది క్రితం చెడిపోయిన సైరన్‌ను బాగుచేయించలేదు. రూ.10 కోట్ల విలువైన బంగారం చోరీ అయ్యాకగానీ మేల్కోలేదు. హిందూపురం వన్‌టౌన్ పరిధిలో ఉన్న బ్యాంకర్లతో సీఐ రాజగోపాల్‌నాయుడు శుక్రవారం సమీక్ష నిర్వహించారు. బ్యాంకుల్లో ఉన్న బంగారం, భద్రత గురించి ఆరా తీశారు.

సూపర్ పోలీస్..!

రూ.1.73 కోట్లు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

వేటాడి పట్టుకొచ్చిన అనంత పోలీసులు



కాంబోడియా నకిలీ యాప్స్‌తో సైబర్ నేరాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను జిల్లా పోలీసులు పట్టుకున్నారు. రాయదుర్గం మండలం వేపరాళ్లకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నరసింహప్పను మాయ చేసి.. రూ.1.73 కోట్లు కొట్టేసిన కేటుగాళ్లను లాక్కొచ్చి జైల్లోకి నెట్టారు. ఈ ముఠాను పట్టుకునేందుకు పోలీసులు నెల రోజులు శ్రమించారు. కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు ఆధ్వర్యంలో సీఐలు జయనాయక్, వెంకటరమణ, షేక్ జాకీర్, పలువురు ఎస్‌ఐలు ప్రత్యేక బృందంగా ఏర్పడి, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ తదితర ప్రాంతాల్లో గాలించారు. ఐదుగురిని అరెస్టుచేసి, రూ.41.20 లక్షల నగదు, కారు, ఏటీఎం కార్డులు, సిమ్‌కార్డులు, సెల్‌ఫోన్లు, బ్యాంక్ పాసుపుస్తకాలు, చెక్‌బుక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను ఎస్పీ జగదీష్ శుక్రవారం వెల్లడించారు.

(వివరాలు మెయిన్‌లో)

వీరజవాన్ కుటుంబానికి బీజేపీ నాయకుల పరామర్శ



వీర జవాన్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు

గోరంట్ల, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లితండాకు చెందిన వీరజవాన్ మురళీనాయక్ కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ శుక్రవారం పరామర్శించారు. వీరజవాన్ చిత్రపటానికి నివాళ్లు అర్పించి, జవాన్ తల్లిదండ్రులు శ్రీరాములనాయక్, జ్యోతిబాయిలను పరామర్శించారు. అనంతరం ఘాట్‌ను సందర్శించారు. ప్రభుత్వంనుంచి అందాల్సిన సహాయ సమకారాలను అందేలా చూస్తామని చెప్పారు. ఆయనతో పాటు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర యువమోర్చా అధ్యక్షులు వంశీకృష్ణ, కన్వీనర్ బోయ లక్ష్మీనారాయణ, హరిక్రిష్ణ, సునీల్, రామాంజి, పూల గంగాధర్, శంకర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, తదితరులున్నారు.

జిల్లాలో 92 శాతం పింఛన్ల పంపిణీ

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం 92.72 శాతం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. ధర్మవరం అర్బన్‌లో అత్యధికంగా 94.87 శాతం, రొళ్ల మండలంలో అతి తక్కువగా 88.12 శాతం పింఛన్లు పంపిణీ చేశామని పేర్కొన్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6.45 గంటల వరకు పంపిణీ చేశామన్నారు. జిల్లాలో మొత్తం 2,64,665 మంది పింఛన్‌దారులు ఉండగా 2,46,751 మందికి పంపిణీ చేశామని వివరించారు. మిగిలిన వారికి శని,ఆదివారాలు కూడా అందజేస్తామని అన్నారు.

శ్రమించి.. సాధించారు

● కానిస్టేబుల్ ఉద్యోగాలకు 307 మంది ఎంపిక
● ఒకే కుటుంబంలో ఇద్దరు, ముగ్గురికి ఉద్యోగాలు
● ఉమ్మడి జిల్లాలో 310 పోస్టులకు నోటిఫికేషన్
● మూడేళ్లు సాగిన ఉద్యోగ నియామక ప్రక్రియ



పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన అక్కా తమ్ముడు రాజేశ్వరి, సంతోష్

అనంతపురం క్రైం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎన్నాళ్లగానో ఎదురు చూస్తున్న ప్రభుత్వ ఉద్యోగం కల సాకారమైంది. తల్లిదండ్రులు కష్టపడి చదివించినందుకు ఫలితం దక్కింది. అమ్మా నాన్న ఆశలను ప్రభుత్వ ఉద్యోగం సాధించి బిడ్డలు నెరవేర్చారు. శుక్రవారం విడుదలైన సివిల్ కానిస్టేబుల్ పరీక్ష ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలో పలువురు యువతీ, యువకులు మంచి మార్కులు సాధించి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇందులో ఒకే కుటుంబం నుంచి ఇద్దరు, ముగ్గురు కూడా ఉన్నారు. దీంతో ఆయా కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 310 పోస్టులకుగాను 307 మంది ఎంపిక య్యారు.

మూడేళ్ల కిందట నోటిఫికేషన్...

పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు ప్రభుత్వం 2022లో నోటిఫికేషన్ ఇచ్చింది. రాష్ట్రంలో 6100 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా అనంతపురం ఉమ్మడి జిల్లాకు సివిల్ కానిస్టేబుల్ పోస్టులు 310 కేటాయించారు. 2023లో ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించారు. తర్వాత హంగార్డులు

(మిగతా 4లో..)

జిల్లా టాపర్ రాఘవేంద్రరెడ్డి



చిలమత్తూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని లాలేపల్లి గ్రామానికి చెందిన జయచంద్రారెడ్డి కుమారుడు రాఘవేంద్రరెడ్డి కానిస్టేబుల్ ఫలితాల్లో జిల్లా టాపర్‌గా నిలిచాడు. వ్యవసాయ కుటుంబా నికి చెందిన అతడు పోలీస్ కావాలన్న లక్ష్యంతో తీవ్రంగా శ్రమించాడు. తండ్రికి వ్యవసాయ పనుల్లో సాయపడుతూనే లక్ష్యం వైపు అడుగులు వేశాడు. పరీక్షలో 200 మార్కులకు 157 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలవడంతో ఆ కుటుంబంలో ఆనందం విల్లవిరిసింది.

ఉపాధి పనుల్లో తప్పులను సరిదిద్దాలి: కలెక్టర్



కేంద్ర బృందం సభ్యులు, అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి పథకంలో చోటుచేసుకుంటున్న చిన్నచిన్న లోటుపాట్లను కేంద్ర బృందం సూచించిన మేరకు సరిదిద్దాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. గతనెల 25 నుంచి ఈనెల 1వరకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన కేంద్ర బృందం సభ్యులు శుక్రవారం కలెక్టర్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర బృందం సభ్యుల సూచన మేరకు కేంద్ర ప్రభుత్వ పథకాల్లో చోటు చేసుకున్న చిన్నచిన్న తప్పులను సవరించి పట్టిష్టంగా అమలుకు కృషిచేయాలని సూచించారు.

సమావేశంలో కేంద్ర బృందం సభ్యులు దయాకర్‌రెడ్డి, చూడామణిరెడ్డి, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారిణి సమత, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ మల్లికార్జునయ్య, భూగర్భజల శాఖ డీడీ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

లింగనిర్ధారణకు పాల్పడితే కేసులు నమోదు

జిల్లాలోని ప్రైవేటు స్కానింగ్ సెంటర్లు, నర్సింగ్ హోమ్‌లలో నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గర్భస్థ శిశు నిర్ధారణ పరీక్ష నిర్మూలనపై జిల్లాస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. లింగనిష్పత్తిలో అసమానతలను తొలగించి, సమాజంలో ఆడపిల్లల శాతం పెంచేందుకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ ఫైరోజ్‌బేగం, దిశ డీఎస్పీ ఆదినారాయణ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి మందికి బాలవికాస్ విద్య

● ఇంగ్లాండ్ సత్యసాయి సేవాసంస్థల అధ్యక్షుడు ప్రతాప్ టక్కర్ ● అలరించిన సంగీత కచేరి



ప్రసంగిస్తున్న ప్రతాప్ టక్కర్



సంగీత కచేరి నిర్వహిస్తున్న యూకే భక్తులు

పుట్టపర్తి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఇంగ్లాండ్‌లో వెయ్యి మంది చిన్నారులకు సత్యసాయి బాలవికాస్ విద్యను అందించామని ఆ దేశ సత్యసాయి సేవాసంస్థల అధ్యక్షుడు ప్రతాప్ టక్కర్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం సాయికుల్వంతు సభామండపంలో ఇంగ్లాండ్ యువత సంగీత కచేరి నిర్వహించింది. మొదట ప్రతాప్ టక్కర్ ప్రసంగిస్తూ.. ప్రపంచానికి సత్యసాయి ఆధ్యాత్మిక గురువుగా పూజలు అందుకుంటున్నారని అన్నారు. ప్రశాంతినిలయం వేదికగా సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఇంగ్లాండులో పలు సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. బంగ్లాదేశ్‌లో వచ్చిన వరదల్లో వైద్యసేవలను అందించామని పేర్కొన్నారు. రక్తదాన శిబిరాలు, పట్టణ మురికివాడల్లో పలు సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. అనంతరం యువత సంగీత గాన కచేరి నిర్వహించారు. సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

కళామతల్లి ముద్దుబిడ్డ రాఘువ

● నేడు బళ్లారి రాఘువ 145వ జయంతి

4

సాహితీ శిఖరం గంగిశెట్టి కన్నుమూత

5



లెక్కే లెక్క..!

అక్రమార్జనలో చెలరేగిపోతున్న సబ్ రిజిస్ట్రార్లు

● ప్రతి డాక్యుమెంట్‌కూ రూ.2వేలు తప్పనిసరి
● వివాదాల భూముల్లో పిండుకున్నంత
● నెల వారి మామూళ్లతో ఉన్నతాధికారుల ఉదాశీనత



అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. ఇక్కడ పనిచేసే ప్రైవేట్ ఉద్యోగుల నుంచి సబ్‌రిజిస్ట్రార్ల వరకు అందరికీ ప్రతి రోజూ ఆదాయమే. ఉమ్మడి జిల్లాలో 21 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. ప్రతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నిత్యం అవినీతి బాగోతమే. కొందరు సబ్ రిజిస్ట్రార్లు నెలవారిగా టార్గెట్ పెట్టుకుని వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఇటీవల కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ నారాయణస్వామి రూ.5లక్షలు తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఉన్నతాధికారులకు సైతం నెలవారి మామూళ్లు ముడుతుండటంతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. పోస్టింగుల విషయంలోనూ ఉదాశీనత ప్రదర్శిస్తుండటమే ఇందుకు నిదర్శనం.

అడ్డూ అదుపులేని ఆదాయం

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అక్రమ ఆదాయానికి అడ్డూ అదుపులేదనే విమర్శలు వినవస్తున్నాయి. సాధారణంగా ప్రతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాల యంలో రిజిస్ట్రేషన్ జరిగే ప్రతి డాక్యుమెంట్‌కు రూ.2వేలు తీసుకుంటారు. ఇది డాక్యుమెంట్ రైటర్లు లేదా బ్రోకర్ల నుంచి నేరుగా సబ్ రిజిస్ట్రార్‌కు వెళ్తుంది. ఇదంతా

(మిగతా 4వ పేజీలో...)

పోయినోళ్లకు ఉపాధి బిల్లులు

దయ్యాలకుంటపల్లిలో మాయాజాలం

● ఉపాధి సిబ్బంది, వైసీపీ నాయకుల కుమ్మక్కు
● ఒక్కగ్రామంలోనే రూ.24.50 లక్షల అవినీతి
● బీకేఎస్ మండలంలో రూ.2 కోట్ల పైగా స్వాహా



దయ్యాలకుంటపల్లిలో విచారణ చేస్తున్న ఏపీడీ చెన్నకేశువులు

దయ్యాలకుంటపల్లి.. బుక్కరాయసముద్రం మండలంలోని ఓ చిన్నగ్రామం.. ఊరి పేరుకు తగ్గట్టుగానే ఆ గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పథకంలో మృతులు పనిచేశారు. చనిపోయిన 54 మంది వ్యక్తుల పేరుతో జాబ్ కార్డులు సృష్టించారు. వారు పనిచేసినట్లు, ఆ మేరకు నగదు డ్రా చేసుకున్నట్లు తాజా విచారణలో వెలుగులోకి వచ్చింది. వైసీపీ హయాంలో ఉపాధి సిబ్బంది, ఆ పార్టీ నాయకులు కుమ్మక్కై మండలంలో రూ. 2 కోట్లకు పైగా స్వాహా చేసినట్లు తెలుస్తోంది.

బుక్కరాయసముద్రం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఉపాధి హామీ పథకంలో అంతులేని అవినీతి జరిగింది. ప్రతి గ్రామంలో లక్షలాది రుపాయలు అక్రమాలకు పాల్పడ్డారు. సామాజిక తనిఖీల్లో ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. బుక్కరాయసముద్రం మండలంలోనే రూ. 2 కోట్లపైగా స్వాహా చేసినట్లు అధికారులు నిగ్గుతేల్చారు. ఇంత అవినీతి జరిగినా... రూ. 2లక్షల 50వేలు మాత్రమే అవినీతి జరిగిందని అప్పట్లో ఏపీడీ గుర్తించడం విమర్శలకు దారితీస్తోంది. ఏపీడీ అవినీతి పరులకు అండగా నిలిచినట్లు తాజాగా వెలుగు చూస్తోంది. రెండు కోట్లకుపైగా అవినీతి జరిగిందని సామాజిక తనిఖీ బృందం 2024లోనే గుర్తించింది. అవినీతి జరగలేదని అప్పటి ఏపీడీ నివేదిక ఇవ్వడంపై అనుమానాలకు దారి తీసింది. దయ్యాలకుంటపల్లిలో డేగల చిన్న కుళ్లాయప్పకు జాబ్ కార్డు నెంబరు 30128 ఉంది. ఆయన 2014లో మృతి చెందారు. 2021 సంవత్సరం జూన్ 15న అతడి పేరిట డబ్బులు డ్రా చేశారు. ఉట్టి సూర్యనారాయణ అనే వ్యక్తి మృతి చెందినా.. 2021లో పని చేసినట్లు రూ.42వేలు డబ్బులు డ్రా చేశారు. వడ్డే అరుణ అనే మహిళ మృతి చెందినా.. ఆమె పేరిట రూ. 51,766 డబ్బులు డ్రా చేశారు. ఇలా పరిశీలిస్తే... దయ్యాలకుంటపల్లిలో అవినీతి కుప్పలతెప్పలుగా బయటికి వస్తోంది. దీని వెనుక ఫీల్డ్ అసిస్టెంట్, ఒక మహిళా మేట్ ఉన్నట్లు గుర్తించారు.

తాజాగా బయటపడిన రూ. 24.50 లక్షల అవినీతి

అప్పుడు సామాజిక బృందం గుర్తించలేని అవినీతి... తాజాగా ఓ ఏపీడీ విచారణ చేపడితే... ఏకంగా చిన్న గ్రామ పంచాయతీ అయిన దయ్యాలకుంటపల్లిలో రూ.24.50 లక్షల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. గతంలో తూతూ మంత్రంగా విచారణ చేసినట్లు తెలుస్తోంది. గతంలో సామాజిక తనిఖీల్లో రూ.12 లక్షల 60వేలు అవినీతి జరిగిందని గుర్తించారు. మృతి చెందిన వారి పేర్లతో జాబ్‌కార్డులు సృష్టించి అప్పటి ఫీల్డ్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, టెక్నికల్ అసిస్టెంట్, సిబ్బంది కలిసి అక్రమాలకు పాల్పడినట్లు తేలింది. దయ్యాలకుంటపల్లి ఉపాధి పనుల్లో అవినీతి జరిగిందని ఆ గ్రామ ప్రజలు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఏపీడీ చెన్నకేశవులును విచారణాధికారిగా నియమించారు. గత 20 రోజులుగా విచారణ చేపట్టారు. గ్రామంలో 198 నకిలీ జాబ్‌కార్డులు సృష్టించి, అందులో నగదు జమచేశారు. 54 మంది మృతి చెందిన వ్యక్తుల పేరిట జాబ్ కార్డులు తయారు చేసి ఐదు సంవత్సరాల పాటు డబ్బులు కాజేశారు. ఆ గ్రామంలోని ప్రజలే కాకుండా అనంతపురం రూరల్, పామిడి, ఇతర మండలాలకు చెందిన వారి పేరిట జాబ్‌కార్డులను ఆన్‌లైన్‌లో ఎక్కించారు. నకిలీ అకౌంట్లకు

(మిగతా 4వ పేజీలో...)

అంకుల్.. మానాన్న ఎప్పుడొస్తారు ?

● అమాయకంగా ప్రశ్నిస్తున్న పిల్లలు
● ఖతర్‌లో తనకల్లు వాసి మృతి
● శోకసంద్రంలో తల్లి, భార్య
● మృతదేహాన్ని తెప్పించేందుకు ప్రయత్నాలు

(వివరాలు 5వ పేజీలో...)



నూరుల్లా ఇంటి వద్ద విషాదంలో మునిగిన కుటుంబ సభ్యులు

నేడు అన్నదాత సుఖీభవ సొమ్ము జమ

వేలాది మంది రైతుల్లో ఆనందం

5

APSRTC

పల్లె వెలుగు

టెండరు ప్రకటన

శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని వివిధ డిపోలకు సంబంధించిన బస్ స్టేషన్‌లలో స్టాళ్ళు/ షాపులు, ఖాళీ స్థలములలో వ్యాపారములు చేసుకొనుట మరుగుదొడ్ల నిర్వహణకు మరియు ఫ్లైఓవర్ పిల్లర్లపై ప్రకటనలు ఇచ్చుటకు అనుభవం ఆసక్తి కలిగిన వ్యాపారస్తులు, సంస్థలు/ఏజెన్సీల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. (1) టెండరు ఫారములు సంబంధిత డిపో మేనేజర్ల వారి కార్యాలయములలో తేది.02-08-2025 నుండి తేది.12-08-2025 వరకు అన్ని ఆఫీసు పనిదినములలో ఉ॥10.30 గంటల నుండి సా॥5.00 గంటల వరకు అమ్మబడును. (2) పూర్తి చేసిన టెండరు ఫారములు తేది.13-08-2025న ఉ॥10.30 గంటల నుండి మ॥2.00 గంటల లోపున జిల్లా ప్రజా రవాణా అధికారి వారి కార్యాలయం, పుట్టపర్తి నందు ఏర్పాటు చేసిన టెండరు బాక్సు నందు వేయవలెను. అదేరోజు మ.3.00 గంటలకు టెండరుదారుల సమక్షములో టెండర్లు తెరువబడును. (3) పూర్తి వివరములకు మా వెబ్‌సైట్ :https://apsrtc.ap.gov.in లో tenders ను చూడగలరు. (4) ఎట్టి కారణము చూపకుండా టెండర్లు అంగీకరించుటకు లేదా తిరస్కరించుటకు మరియు రద్దుచేయుటకు APSRTC కి పూర్తి అధికారము కలదు.

నెం. P3/437(05)/2025-DPTO(S),తేది: 31-07-2025 సం/- జిల్లా ప్రజా రవాణా అధికారి, పుట్టపర్తి, శ్రీసత్యసాయి జిల్లా.

అక్రమాలకు చెక్ !

● నిర్భయంగా భూములు కొనవచ్చు ● స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖలో మార్పులు

పీడీ తయారీ సమయంలోనే ఫొటోలు

థంబ్ వేస్తే కొనుగోలుదారుడికే డాక్యుమెంట్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్లలో అక్రమాలకు చెక్ పడనుంది. ఎవరినో తీసుకొచ్చి ఇతనిదే భూమి అని చెప్పి దొంగ రిజిస్ట్రేషన్ చేయించడం ఇకపై కుదరదు. గతంలో ఒకే పేరున్న వ్యక్తులను తీసుకొచ్చి, ఆధార్ లో మార్పులు(నకిలీ)



ప్రస్తుతం పీడీలో ఫొటోలు

చేసి రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. డబుల్ రిజిస్ట్రేషన్లు సైతం జరిగాయి. వీటన్నింటికీ ఇకపై చెక్ పడనుంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కాకముందే డాక్యుమెంట్ ఎవరు చేయించుకుంటున్నారో స్పష్టంగా తెలిసిపోతుంది. స్టాంపు లు, రిజిస్ట్రేషన్ల శాఖలో ప్రభుత్వం పలు మార్పులు చేసింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ముందు ప్రిపరేషన్ డేటా(పీడీ) తీసే సమయంలో ఇది వరకు సంబంధిత వ్యక్తుల వివరాలు మాత్రమే వచ్చేవి. దీంతో భూమికి సంబంధం లేని వ్యక్తిని తీసుకొచ్చినా తెలిసేదికాదు. ప్రస్తుత మార్పుల నేపథ్యంలో సంబంధిత వ్యక్తి ఆధార్ నెంబర్ చెప్పగానే ఆవ్యక్తి మొబైల్ కు ఓటీపీ వస్తుంది. ఓటీపీ చెప్పగానే ఆధార్‌లో ఉన్న ఫొటో పీడీలో వస్తుంది. మూడురోజుల నుంచి ఈ విధానం అమలవుతోంది.

కొనుగోలుదారుడి చేతికే డాక్యుమెంట్

రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యాక వచ్చే డాక్యుమెంట్ అత్యంత కీలకం. అది ఇకపై నేరుగా సంబంధిత ఆస్తి లేదా భూమి కొనుగోలు చేసిన వ్యక్తికే అందజేయనున్నారు. ఈ విషయంలో గతంలో క్రయ, విక్రయ దారులు ఇబ్బందులు పడేవారు. కొందరు మధ్యవర్తులు జోక్యం చేసుకుని డాక్యుమెంట్లు తీసుకునేవారు. కొన్ని సందర్భాల్లో డాక్యుమెంట్ రైటర్లు తీసుకొని ఎవరో ఒకరికి ఇవ్వడం ద్వారా కొనుగోలు చేసిన వ్యక్తికి దక్కడంలో ఇబ్బందులు ఎదురయ్యేవి. ప్రస్తుత విధానంలో ఎవరైతే కొనుగోలు చేస్తారో వారే కార్యాలయంలో థంబ్ వేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత డాక్యుమెంట్‌ను సంబంధిత వ్యక్తికి అందజేయనున్నారు.

ఓటీపీ ఇక్కట్లు

నూతన విధానంలో కొన్ని సమస్యలు వస్తున్నాయి. ఓటీపీ వల్ల కొన్ని చిక్కులు ఎదురవుతున్నాయి. మొబైల్ ఫోన్‌ను ఆధార్‌కు లింక్ చేసుకోని వారికి ఇది ఇబ్బందిగా మారింది. అత్యవసరంగా రిజిస్ట్రేషన్ కోసం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి కూడా డాక్యుమెంటేషన్ చేయించుకోలేని పరిస్థితి తలెత్తుతోందని డాక్యుమెంట్ రైటర్లు చెబుతున్నారు. చదువు రానివారు, గ్రామీణ ప్రాంత ప్రజలు ఓటీపీ ద్వారా



అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

మెసేజ్‌లు అర్థం కాక ఇబ్బంది పడుతున్నారని వారు పేర్కొన్నారు. ఈ క్రమంలో పదుల సంఖ్యలో డాక్యుమెంట్లు పెండింగ్‌లో ఉన్నాయని ఆ వర్గాలు చెబుతున్నాయి. ఆధార్ నంబర్ నమోదు చేయగానే ఓటీపీ రాకుండా కేవలం ఫొటో వచ్చేలా చేస్తే సరిపోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఫొటోల ద్వారా తెలిసిపోతుంది

రిజిస్ట్రేషన్‌కు ముందు ప్రిపరేషన్ డేటా(పీడీ) తీసే సమయంలో గతంలో ఫొటోలు వచ్చేవి కావు. ఇప్పుడు ఆధార్ ఓటీపీ విధానంతో ఫొటో వస్తోంది. దీంతో సంబంధిత వ్యక్తి అసలైన వ్యక్తా కాదా అనేది స్పష్టంగా తెలిసిపోతుంది. దీంతో మోసాలకు తావుండదు. రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక డాక్యుమెంట్‌ను కూడా ఎవరైతే కొనుగోలు చేస్తారో వారే తీసుకోవచ్చు. థంబ్ వేయడం ద్వారా సంబంధిత వ్యక్తే తీసుకోవాల్సి ఉంటుంది.

- రమణరావు, జాయింట్-1 సబ్‌రిజిస్ట్రార్, అనంతపురం

1123.92 గ్రాముల బంగారం సీజ్



సీజ్ చేసిన బంగారం, నగదు

తాడిపత్రి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రి పోలీసులు 1123.92 గ్రాముల బంగారం ఆభరణాలను సీజ్ చేశారు. అడిషనల్ ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి ఆధ్వర్యంలో కడప రహదారిలో గురువారం రాత్రి వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ వాహనంలో ఆధారాలు లేని బంగారం ఆభరణాలు కనిపించాయని సీఐ శివగంగాధర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఉబేదుల్లా, ఆయన కుమారులు కారులో తాడిపత్రికి వస్తుండగా అనుమానంతో తనిఖీలు చేశామని తెలిపారు. బిల్లులు సరిగా లేకపోవడంతో వారి వద్ద ఉన్న బంగారంతోపాటు రూ.1,48,700 నగదును సీజ్ చేశామని తెలిపారు. వాటిని పరిశీలించి కస్టమ్స్ అధికారులకు అప్పగించామని తెలిపారు.

డెప్యుటేషన్‌పై నలుగురు గుమాస్తాల బదిలీ

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ కార్యాలయంలోని నలుగురు గుమాస్తాలను డెప్యుటేషన్‌పై బదిలీ చేస్తూ డీపీఓ నాగరాజనాయుడు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీనియర్ అసిస్టెంట్ ఉషారాణిని డీఎల్‌పీఓ కార్యాలయానికి బదిలీ చేశారు. డీఎల్‌పీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న మనోహర్‌ను డీపీఓ కార్యాలయానికి బదిలీ చేశారు. డీపీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న నితీష్‌కుమార్‌ను గుంతకల్లు డీఎల్‌పీఓ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆ స్థానంలో అనంతపురం డీఎల్‌పీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న భారతిని నియమించారు. బదిలీల ప్రక్రియ ముగిసిన తరువాత వర్కింగ్ అడ్జెస్ట్‌మెంట్ పేరుతో బదిలీలకు శ్రీకారం చుట్టడం పలువురు సిబ్బందికి షాక్ ఇచ్చినట్లు అయింది. సాధారణ బదిలీల్లో భాగంగా జూనియర్ అసిస్టెంట్‌గా డీపీఓ కార్యాలయానికి వచ్చిన నితిష్‌కుమార్‌ను తిరిగి గుంతకల్లుకు మార్చడంపై ఏఓ నాగరాజుతో ఆయన వాదనకు దిగినట్లు తెలిసింది. అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మార్చాల్సి వచ్చిందని చెప్పినట్లు సమాచారం.

'5న జర్నలిస్టుల డిమాండ్స్ డే పాటిద్దాం'

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఈనెల 5న జర్నలిస్టుల డిమాండ్స్ డేగా పాటించాలని ఏపీయూడబ్ల్యూజే పిలుపునిచ్చింది. ఈ మేరకు శుక్రవారం శ్రీసత్యసాయిజిల్లా కమిటీ అధ్యక్షుడు పుల్లయ్య, కార్యదర్శి బాబు, ఐజేయూ సభ్యుడు శ్రీనివాసులు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు హరి, రాష్ట్ర కమిటీ సభ్యులు మురళి, జి. వెంకటనారాయణ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాతో పాటు మండల, రెవెన్యూ డివిజనల్ కేంద్రాలలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులంతా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. కొత్త అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని జర్నలిస్టులు ఆయా ప్రాంతాల్లో ఈనెల 5న నిరసన కార్యక్రమాలు చేపట్టి అధికారులకు వినతి పత్రాలు అందచేయాలని తెలిపారు.

పోయినోళ్లకు ఉపాధి బిల్లులు

(3వ పేజీ తరువాయి)

ఫీల్డ్ అసిస్టెంట్, కొంత మంది వైసీపీ నాయకుల ఫోన్ నెంబర్లకు లింక్ చేసుకుని డబ్బులు డ్రా చేసినట్లు విచారణలో తేలింది. ఇందులో పోస్టల్ సిబ్బంది హస్తం కూడా ఉన్నట్లు తేలింది.

మండలంలో రూ.2 కోట్ల దోపిడీ

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు కలిసి మండల వ్యాప్తంగా రూ. 2కోట్ల పైగా అవినీతికి పాల్పడినట్లు బయటపడింది. బుక్కరాయసముద్రం గ్రామ పంచాయతీలో రూ.2 కోట్లపైగా పనులు చేపట్టగా.. అందులో రూ.1.10 కోట్లు స్వాహా అయినట్లు సామాజిక తనిఖీలో గుర్తించారు. సిద్దరాంపురం గ్రామంలో రూ.8లక్షల, చెదల్లలో రూ.2.67 లక్షలు, పసులూరులో రూ.3.97 లక్షలు, జంతులూరులో రూ.7 లక్షలు, చెన్నంపల్లిలో రూ.7.50 లక్షలు.. ఇలా మొత్తం రూ.2 కోట్ల వరకు అక్రమాలు జరిగినట్లు గుర్తించారు.

అవినీతి బయటపడింది వాస్తవమే

దయ్యాలకుంటపల్లిలో ఉపాధి హామీ పథకంలో 2020 నుంచి 2024 వరకు జరిగిన ఉపాధి పనులలో అవినీతి జరిగింది వాస్తవమే. మృతి చెందిన వ్యక్తుల పేరిట జాబ్ కార్డుల సృష్టించి, వారికి వచ్చిన బిల్లులను స్వాహా చేసినట్లు విచారణలో బయటపడింది. పోస్టు కార్యాలయాన్ని వేదికగా చేసుకుని అవినీతికి పాల్పడినట్లు తేలింది. మొత్తం 198 జాబ్ కార్డులు నకిలీవి అని తేలాయి. అందులో కొంత మందికి నగదును ఇచ్చినట్లు తేలింది. మృతి చెందిన 54 మంది పేరిట ఐదు సంవత్సరాల నుంచి బిల్లులు తీసుకున్నారు. మొత్తం రూ.24.50 లక్షలు స్వాహా అయినట్లు ఇప్పటి వరకు తేలిందన్నారు. ఇంకా విచారణలో ఎంత బయట పడుతుందో తెలియాల్సి ఉంది. ప్రస్తుతం విచారణ చేసిన నివేదికను కలెక్టర్‌కు పంపుతున్నాం.

- చెన్నకేశవులు, ఏపీడీ, డ్వామా

లెక్కే లెక్క..!



రామ్‌నగర్‌లోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

(3వ పేజీ తరువాయి)

సర్వసాధారణంగా ప్రతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగే బహిరంగ వ్యవహారం. కొన్ని కార్యాలయాల్లో ప్రతి రోజు 10 నుంచి 15వరకు, మరి కొన్ని కార్యాలయాల్లో 25నుంచి 40వరకు డాక్యుమెంట్లు అవుతుంటాయి. అంటే కనీసం రూ.20వేలు మొదలుకొని దాదాపు రూ.లక్ష వరకు సజావుగా వచ్చే ఆదాయం ఇది. ఇక నిబంధనలకు విరుద్ధంగా చుక్కల భూములు రిజిస్ట్రేషన్ చేస్తే ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.1.5లక్ష వరకు వసూలు చేస్తారు. అందులో గిఫ్ట్ డీడ్(దానం) అయితే సగం వరకు తగ్గించి తీసుకుంటారు. ఏవైనా పత్రాలు పొందుపరిచే విషయంలో తేడాలుంటే ఆ లెక్క వేరే ఉంటుంది. ఇక కమర్షియల్ భూములను సాధారణ భూములుగా చూపించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి విక్రయ దారులు ఇచ్చే పైసలు పుచ్చుకుంటారు. సాధారణ భూములను కమర్షియల్ ఏరియాగా చూపించి ఎక్కువ చలానా అవుతుందని, తగ్గిస్తున్నామని చెప్పి మరింత వసూలు చేస్తారు. ఇలాంటి లెక్కలకు అడ్డూ అదుపూ ఉండదు.

సీనియర్ అసిస్టెంట్లకే ఇన్‌చార్జ్ బాధ్యతలు

ఏ ప్రభుత్వశాఖలోనూ లేని సౌలభ్యం రిజిస్ట్రేషన్ శాఖలో ఉంది. ఏ శాఖలోనైనా సీనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగికి ప్రమోషన్ వస్తే సూపరింటెండెంట్ స్థాయికి వస్తారు. కానీ ఇక్కడ రెగ్యులర్ సబ్‌రిజిస్ట్రార్ లేకపోతే ఇన్‌చార్జ్‌గా సీనియర్ అసిస్టెంట్లకే బాధ్యత అప్పగిస్తారు. అలా అనంతపురంలోని రెండు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు జిల్లాలో కొన్ని కార్యాలయాల్లో చక్రం తిప్పిన ఘనులున్నారు. వారు సంపాదించిన అక్రమ డబ్బుతో ఎప్పుడో రూ.కోట్లకు పడగలెత్తారు. ఇటీవల కళ్యాణదుర్గంలో ఏసీబీకి దొరికిన నారాయయణస్వామి కూడా సీనియర్ అసిస్టెంటే కావడం గమనార్హం. తాడిపత్రిలో పనిచేస్తున్న ఓ అధికారి ముడుపులు పుచ్చుకోవడంలో బిజీగా ఉంటున్నారు. ఆయనపై లెక్కలేనన్ని ఆరోపణలు ఉన్నాయి. రిజిస్ట్రేషన్ల విషయంలో భారీగానే వెనకేసుకుంటున్నారని సమాచారం. లోకల్, అధికార పార్టీ రాజకీయ మద్దతుతో చెలరేగిపోతున్నారని సమాచారం. శ్రీ సత్యసాయి జిల్లా బుక్కపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కీలకంగా ఉన్న ఓ అధికారి ఎస్ఆర్ఐలకు ఆస్తుల విషయంలో బాగానే వెనకేసుకున్నట్లు సమాచారం. తాజాగా ఓ ఘటనలో పోలీస్ కేసు అయ్యాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి మరీ సంతకాలు చేయించుకొచ్చారు. ఈ వ్యవహారంలో సంబంధిత అధికారికి పెద్ద మొత్తంలోనే ముడుపులు అందినట్లు తెలిసింది. చెన్నేకొత్తపల్లిలో గతంలో పలు భూముల విషయాల్లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న కీలక ఉద్యోగి మళ్లీ అక్కడికే పోస్టింగ్ తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఆయన అంతా తానై అక్కడ చక్రం తిప్పుతున్నారు.

ఏసీబీకి దొరికిన వారికీ పోస్టులు

అవినీతి వ్యవహారంలో ముదిరిపోయి సస్పెండైన వారికీ, ఏసీబీ అధికారుల తనిఖీల్లో దొరికిన వారికి సైతం కొద్ది కాలానికే పోస్టింగ్ ఇస్తున్నారు. ప్రస్తుతం శ్రీ సత్యసాయి జిల్లా బుక్కపట్నం సబ్‌రిజిస్ట్రార్‌గా ఉన్న రామ్మోహన్ కళ్యాణదుర్గం సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సమయంలో సస్పెండ్ అయ్యారు. పార్టీ లేకుండానే డాక్యుమెంట్‌ను రద్దు చేసిన విషయంలో ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది. అయితే కొద్ది కాలానికే ఆయనకు పోస్టింగ్ ఇచ్చారు. కదిరి సబ్‌రిజిస్ట్రార్‌గా ఉన్న వెంకటనారాయణ చిలమత్తూరు సబ్‌రిజిస్ట్రార్‌గా ఉన్న సమయంలో సస్పెన్షన్‌కు గురయ్యారు. అనంతపురం రూరల్ సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న మహబూబ్ అలీ ఏసీబీ అధికారుల తనిఖీలో ఆయన మేనల్లుడు రూ1.5లక్షలు తీసుకుని పట్టుబడ్డాడు. ఆయనకు గుత్తి సబ్‌రిజిస్ట్రార్‌గా బాధ్యతలు అప్పగించారు. అయితే అనారోగ్యం కారణంగా ఆయన సెలవులో ఉండటంతో సీనియర్ అసిస్టెంట్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. తాజాగా వివాదాస్పదమైన కళ్యాణదుర్గం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతిపరులకు పట్టం కట్టారు. సీకే పల్లిలో పని చేసిన సమయంలో భారీగా ఆరోపణలు, అనంతపురం రూరల్ కార్యాలయంలో సస్పెండైన మురళికి కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్‌గా బాధ్యతలు కట్టబెట్టారంటే ఉన్నతాధికారుల ఆలోచనా విధానం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

చర్యలు తీసుకుంటాం: శ్రీనివాసులు, జిల్లా రిజిస్ట్రారు, అనంతపురం

సబ్‌రిజిస్ట్రార్లు అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. అందులో ఎవరినీ ఉపేక్షించం. పై అధికారులకు నెల మామూళ్లు అనేది అవాస్తవం. కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేశాం. కొన్ని కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్లే ఇన్‌చార్జ్‌లుగా ఉన్నారు. సబ్ రిజిస్ట్రార్ల ప్యానల్ రెడీ అవుతోంది. ఈ నెలాఖరులోపు సబ్‌రిజిస్ట్రార్లను నియమించే అవకాశం ఉంది.

కృష్ణా జలాలకు పూజలు



పూజలు చేస్తున్న అధికారులు

కూడేరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పీఏబీఆర్ డ్యాంలోకి కృష్ణా జలాలు వస్తుండటంతో ఇరిగేషన్ అధికా రులు శుక్రవారం పూజలు చేశారు. పీఏబీఆర్ డ్యాం డీఈఈ వెంకటరమణ, ఏఈఈలు లక్ష్మిదేవి, గంగమ్మ, ముత్యాలప్ప, రేణుక తదితరులు కొర్రకోడు గ్రామ సమీపంలో కృష్ణా జలాలకు పూజలు చేశారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి వెయ్యి క్యూసెక్కుల నీరు పీఏబీఆర్ డ్యాంలోకి చేరుతోంది. దీంతో డ్యాంలో నీటి నిల్వ 1.852 టీఎంసీలకు చేరింది.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురంరూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఖాళీగా ఉన్న వివిధ కేటగిరీల సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి తెలిపారు. ఆమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కళాశాలలో వివిధ కేటగిరీల్లో 25సీట్లు, ఈడబ్ల్యూఎస్‌లో మూడు సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల నాలుగో తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. 5న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని తెలిపారు. స్పాట్ అడ్మిషన్లు పొందే విద్యార్థులు ప్రభుత్వ స్కాలర్ షిప్‌కు అనర్హులన్నారు. అడ్మిషన్ కోసం వచ్చే విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఫీజు మొత్తం కట్టాల్సి ఉంటుందన్నారు. అనంతపురంతోపాటు జిల్లాలోని కళ్యాణదుర్గం, రాయదుర్గం, తాడిపత్రి, ఉరవకొండ, గుంతకల్లులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఖాళీ సీట్లకు కూడా స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఇన్నొవేషన్ సెంటర్‌లో ఏర్పాట్లు పూర్తి చేస్తాం

● వీసీలో ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రతన్ టాటా ఇన్నొవేషన్ సెంటర్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ తెలిపారు. రతన్ టాటా ఇన్నొవేషన్ సెంటర్‌ల ఏర్పాటుపై గుంటూరు, వైజాగ్, రాజమండ్రి, ఎన్టీఆర్, అనంతపురం, తిరుపతి జిల్లాల జాయింట్ కలెక్టర్లతో విజయవాడ నుంచి ఐటీ సెక్రటరీ భాస్కర్ కాటమనేని శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి వీసీలో ఇన్‌చార్జ్ కలెక్టర్‌తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్ పాల్గొన్నారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని జేఎన్టీయూ అడ్మిన్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేస్తున్న రతన్‌టాటా ఇన్నొవేషన్ సెంటర్‌లో అవసరమైన పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రతన్ టాటా ఇన్నొవేషన్ సెంటర్ గురించి పరిశ్రమలు, విద్యాసంస్థలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమా లను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ మురళీకృష్ణ, డీఈ రాజగోపాల్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రతాప్‌రెడ్డి, జేఈ బాలకాటమయ్య పాల్గొన్నారు.

పీ-4తో సమగ్రాభివృద్ధి

● మంత్రి సత్యకుమార్



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరంరూరల్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): పీ-4తో సమగ్రాభివృద్ధి వైపు ముందడుగు పడుతుందని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. పీ-4 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నియోజకవర్గస్థాయి అధికారుల తో పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మంత్రితో పాటు టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన నాయకుడు చిలకం మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యం, ప్రైవేటు రంగ సహకారం, ప్రభుత్వ కార్యాచరణ అనే మూడు మౌలిక అంశాలపై పీ-4 కార్యక్రమం రూపొందించబడిందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను బంగారు కుటుంబాలుగా గుర్తించి, వాటిని అభివృద్ధి చేయడానికి ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 9,584 బంగారు కుటుంబాలను గుర్తించినట్లు వెల్లడించా రు. వీటిలో 5,932కుటుంబాలను ఇప్పటికే దత్తత తీసుకున్నట్లు తెలిపారు. ధర్మవరం పట్టణంలో 4,222బంగారు కుటుంబాలు ఉన్నాయని, వీటిలో 3,333 కుటుంబాలు ఇప్పటికే మార్గదర్శులచే దత్తత తీసుకున్నట్లు తెలిపారు. మ్యాపింగ్, జియో ట్యాగ్ ఫొటోలు, కేపీఐఎస్ ఫ్యామిలీ ట్రాకర్ యాప్ వంటి ఆధునిక సాంకేతిక సాధనాలను వినియోగిస్తూ కార్యక్రమాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేష్, మున్సిపల్ కమీషనర్ ప్రమోద్‌కుమార్, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సీపీఏపీ అకాడమీషియన్ సురేంద్రనాయుడు, బృంద సభ్యులు, నియోజకవర్గ మార్గదర్శకులు పాల్గొన్నారు.

శ్రమించి.. సాధించారు

(3వ పేజీ తరువాయి)

కోర్టుకు వెళ్లడం, 2024 సార్వత్రిక ఎన్నికల వల్ల కొంత జాప్యమైంది. తర్వాత 2025 జనవరి, ఫిబ్రవరిలో ఈవెంట్స్ నిర్వహించారు. కానిస్టేబుల్ పోస్టుల ఎంపికలో భాగంగా 6484 మంది అభ్యర్థులను ఎత్తు, బరువు, ఛాతీ కొలతల పరీక్షల(ఫిజికల్ స్టాండర్ టెస్ట్)కి పిలిచారు. 4366 మంది అభ్యర్థులు హాజరు కాగా 3907 మంది అర్హత సాధించారు. వీరికి 100 మీటర్స్ పరుగు, లాంగ్ జంప్ ఇతర పరీక్షలు (ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్) నిర్వహించగా 3022 మంది క్వాలిఫై అయ్యారు. ఒక్కో పోస్టుకు సుమారు 100 మంది పోటీ పడ్డారు. ఈ ఏడాది జూన్ తొలివారంలో మెయిన్స్ పరీక్షలు నిర్వహించారు. మంగళగిరిలో హోంమంత్రి అనిత, డీజీపీ ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు.

అక్కా తమ్ముడు, అన్నా తమ్ముడు

సోమందేపల్లి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు గొర్రెలు కాస్తూ తమను చదివించడం చూసిన ఆ అక్కా తమ్ముడు పట్టుదలగా చదివారు. పేదరికాన్ని జయించాలని అహర్నిశలు శ్రమించారు. ఈక్రమంలోనే కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఇద్దరు ఒకే సారి ఎంపికయ్యారు. వారే మండలంలోని సుద్దకుంటపల్లి గ్రామానికి చెందిన చక్కీరప్ప, వెంకటలక్ష్మి కుమారుడు సంతోష్, కుమార్తె రాజేశ్వరి. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రభుత్వ ఉద్యోగం సాధించారు.



● కృషి, పట్టుదల ఉంటే సాధించ లేనిది లేదని నిరూపించారు సోమందేపల్లిలోని గీతానగర్‌కు చెందిన అన్నదమ్ములు బుగిడి అనీల్‌కుమార్, బుగిడి సంతోష్‌కుమార్. తండ్రి వెంకటేశ్, తల్లి వెంకటలక్ష్మి ప్రోత్సాహంతో కానిస్టేబుల్ కొలువులు సాధించారు.

ప్రపంచీకరణను దాటుకుని కవిత్వం రాయాలి

● కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం



అమరమ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు

అనంతపురం టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వర్తమాన కవి ప్రపంచీకరణను దాటుకుని కవిత్వం రాయాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సంస్థ ఐదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు టీవీ రెడ్డి రచించిన 'అమరమ్' పుస్తకావిష్కరణ సభను శుక్రవారం జిల్లా కేంద్ర గ్రంథాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఉమ్మడిశెట్టి సాహితీ ట్రస్టు చైర్మన్ రాధేయ అధ్యక్షతన నిర్వహించిన ఈ సభకు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించిన మాట్లాడారు. వర్తమాన కవి ప్రపంచీకరణ దాటుకుని కవిత్వం రాయలేని పరిస్థితి ఉందని, ఈ ప్రపంచీకరణ నుంచే అన్ని వాదాలు ఏర్పడ్డాయని, కవి అయినవారు చాలా జాగ్రత్తగా వర్తమాన వాదాలను పట్టుకుని కవిత్వం రాయాల్సిన అవసరం ఉందన్నారు. టీవీ రెడ్డి సామాన్య కార్మికుడుగా ప్రస్థానం ప్రారంభించి సామాజిక సేవా కార్యకర్తగా ఎదుగుతూ, సాహిత్య రంగంలోకి ప్రవేశించి, కవిత్వంలో కూడా నిబద్ధతను చాటుతూ 'అమరమ్' కవితా సంపుటిని తీసుకురావడం అభినందనీయమన్నారు. అనంతరం పలువురు కవులు, కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో జనప్రియ కవి ఏలూరు యంగన్న, కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి రమా, అమరనాథరెడ్డి, ఆదినారాయణ, మంచాల రామకృష్ణారెడ్డి, పొట్లూరు హరికృష్ణ, సంజీవులు, సుబ్బరంగయ్య, గద్వాల సోమన్న, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, డాక్టర్ శాంతినారాయణ, తూముచర్ల రాజారాం, వెంకటేశ్వర్లు, సురేష్,జయరాం, మధురశ్రీ, రియాజుద్దీన్ పాల్గొన్నారు.

కళామతల్లి ముద్దుబిడ్డ రాఘవ

నేడు బళ్లారి రాఘవ 145వ జయంతి

నలుగురికి రాఘవ అవార్డులు



అనంతపురం టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): భారతదేశం గర్వించదగ్గ కళామతల్లి ముద్దు బిడ్డ బళ్లారి రాఘవ. శనివారం ఆయన 145వ జయంతి. బళ్లారి రాఘవగా పేరొందిన తాడిపత్రి రాఘవాచార్యులు 1880 ఆగస్టు 2న అనంతపురం జిల్లా తాడిపత్రిలో నరసింహాచారి, శేషమ్మ దంపతులకు జన్మించారు. బళ్లారిలో ఉన్నత పాఠశాలలో మెట్రిక్ వరకు చదువుకున్న రాఘవ తర్వాత మద్రాసులోని క్రిస్టియన్ కాలేజీలో న్యాయశాస్త్రం కోర్సులో చేరారు. 1905లో న్యాయశాస్త్రంలో ఉత్తీర్ణత పొందారు. కర్నూలుకు చెందిన లక్ష్మణాచారి కుమార్తె కృష్ణమ్మను జీవిత భాగస్వామిగా చేసుకున్నారు. మద్రాసులోనే న్యాయశాస్త్రం ప్రాక్టీసు ఆరంభించి, కొద్దికాలంలోనే న్యాయవాదిగా మారారు. కానీ ఆయనకు చిన్నప్పటి నుంచే నాటకాలపై అమితాసక్తి ఉండేది. మేనమామ ధర్మవరం రామకృష్ణవచార్యులు రాఘవను ప్రోత్సహించేవారు. 12వ యేటనే రాఘవ మొదటిసారి రంగస్థలంపై నటించారు. బళ్లారిలో షేక్స్పియర్ క్లబ్ స్థాపించి, దానిద్వారా షేక్స్పియర్ నాటకాలు ప్రదర్శించేవాడు. తెలుగు, కన్నడ, ఇంగ్లీషు, హిందీ భాషలన్నింటిలోనూ రాఘవ ప్రదర్శనలిచ్చారు. శ్రీలంక, ఇంగ్లాండు, ఫ్రాన్స్, జర్మనీ, స్విట్జర్లాండ్ వంటి దేశాలలో పర్యటించి భారతీయ నాటకాలు, కళలను గురించి ఉపన్యాసాలు, సదస్సులు నిర్వహించారు. మిత్రుల ఒత్తిడితో 1936లో రాఘవ సినీ రంగ ప్రవేశం చేశారు. హెచ్ఎం రెడ్డి నిర్మించిన 'ద్రౌపదీమాన సంరక్షణము' చిత్రంలో దుర్యోధనుడుగా నటించారు. రైతుబిడ్డ, చండిక, కన్యాశుల్కం సినిమాల్లోనూ నటించి అనతికాలంలోనే విశేష ఖ్యాతి పొందారు. తన సమయాన్ని, సంపదను నాటకరంగ పురోగతి కోసం ధారాళంగా వెచ్చించే బళ్లారి రాఘవ 1946 ఏప్రిల్ 16న స్వర్గస్థులయ్యారు.

బళ్లారి రాఘవ పేరిట అవార్డు స్థాపన...

బళ్లారి రాఘవ కళారంగంతోపాటు ఈ లోకాన్ని వీడిన నాటి నుంచి కళాసంస్థలు, కళాకారులు ఆయనను స్మరించుకుంటూ ప్రతియేటా జయంతి, వర్ధంతి సమయాల్లో విశేషమైన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అనంతపురం జిల్లా కేంద్రంలోని లలితకళాపరిషత్ ఆధ్వర్యంలో 1999లో బళ్లారి రాఘవ అవార్డును స్థాపించారు. నాటి నుంచి యేడాదికోసారి సినీ, నాటక రంగాల్లో ఉత్తమ నటులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయిలో అవార్డుల ప్రదానం చేస్తున్నారు. 1999లో సినీనటుడు నూతన్‌ప్రసాద్‌కు తొలి అవార్డు ప్రదానం చేశారు. 2025 ఏడాదికి సంబంధించి తెనాలికి చెందిన మేరిగె రామలింగేశ్వరరావు, గుంటూరు జిల్లా రేపల్లెకు చెందిన భూపతి ధర్మారావుకు రాష్ట్ర స్థాయి బళ్లారి రాఘవ అవార్డులు, జిల్లాకు చెందిన వాల్మీకి కుళ్లాయప్ప, మల్లెల జయరాం జిల్లా స్థాయి అవార్డులకు ఎంపికయ్యారు. శనివారం సాయంత్రం లలితకళాపరిషత్‌లో నిర్వహించే అవార్డు ప్రదానోత్సవ సభలో వీరికి బళ్లారి రాఘవ అవార్డులు అందజేసి సత్కరించనున్నారు.



మేరిగె రామలింగేశ్వరరావు, భూపతి ధర్మారావు, వాల్మీకి కుళ్లాయప్ప, మల్లెల జయరాం

అవార్డులతో కళాకారులకు ప్రోత్సాహం



జిల్లావాసి అయిన బళ్లారి రాఘవ కళల్లో నిష్ణాతుడు. కళారంగం అభివృద్ధి కోసం విశేష సేవలందించిన ఇలాంటి మహోన్నతులను భావితరాలకు పరిచయం చేయడంతో పాటు కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రతియేటా బళ్లారి రాఘవ అవార్డులను ప్రదానం చేస్తున్నాం. అవార్డులతోపాటు ప్రతియేటా బళ్లారి రాఘవ జయంతి రోజున నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నాం. శనివారం సాయంత్రం అవార్డుల ప్రదానోత్సవ సభ, అనంతరం 'గోవు మా లచ్చిమి' సాంఘిక నాటక ప్రదర్శన నిర్వహించనున్నాం.

- గాజుల పద్మజ, ప్రధాన కార్యదర్శి, లలితకళాపరిషత్

సెంట్రల్ యూనివర్సిటీ
విద్యార్థులకు అస్వస్థత
వంద మందికి పైగా ఆసుపత్రిపాలు



చికిత్సకోసం ప్రైవేట్ ఆసుపత్రికి వచ్చిన విద్యార్థులు

అనంతపురం వైద్యం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీలో గురు, శుక్ర వారాల్లో దాదాపు వంద మందికిపైగా విద్యార్థులు ఆసుపత్రి పాలయ్యారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 1600 మందికిపైగా విద్యార్థులు ఇక్కడ డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులు అభ్యసిస్తున్నారు. వేసవి సెలవుల అనంతరం గతనెల 21నుంచి విద్యార్థులు తిరిగి వర్సిటీకి వస్తున్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలోనే విద్యార్థులు అస్వస్థకు గురయ్యారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. విద్యార్థులను పరీక్షించిన వైద్యవర్గాలు మాత్రం ఫుడ్‌పాయిజన్, కలుషిత నీరు కారణమై ఉంటుందని పేర్కొంటున్నాయి. విద్యార్థుల అస్వస్థత నేపథ్యంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి సెంట్రల్ యూనివర్సిటీని సందర్శించారు. వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించారు. జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు, బుక్కరాయసముద్రం ప్రాథమిక వైద్య కేంద్రం డాక్టర్లు విద్యార్థులు పరీక్షించారు.







చికిత్స పొందుతున్న విద్యార్థులు

రెండు రోజులుగా...

సెంట్రల్ వర్సిటీలోని విద్యార్థులు గురువారం నుంచి శుక్రవారం వరకు అస్వస్థకు గురయ్యారు. తీవ్ర జ్వరం, తలనొప్పి, కళ్లుతిరిగి పడిపోవడం, కడుపునొప్పి, గొంతునొప్పి, వాంతులు, విరేచనాలతో బాధపడ్డారు. గురువారం మధ్యాహ్నం కొంతమంది బాధిత విద్యార్థులను వర్సిటీ బస్సులో అనంతపురంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వారిలో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు అడ్మిషన్ చేసి వైద్యసేవలందిస్తున్నారు. ఇలా శుక్రవారం వరకు మూడు నుంచి నాలుగు సార్లు విద్యార్థులను బస్సులో ఆసుపత్రికి తరలించారు. గురువారం తెల్లవారుజామున కొంతమంది విద్యార్థులు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చివెళ్లారు. వీరిలో బాలికలే అధికంగా ఉన్నారు. 50మందికిపైగా క్యాజువాల్టీ, వార్డుల్లో అడ్మిషన్ అయ్యారు. ఆస్పత్రిలో చేరిన విద్యార్థులకు తోటి విద్యార్థులే సపర్యలు చేస్తున్నారు. కాగా వర్సిటీలోని కొందరి అధికారులు తీరు రోజురోజుకు వివాదాస్పదమవుతోంది. వారి పరిధిలో ఏదైనా సమస్య ఏర్పడినప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా సొంతనిర్ణయాలు తీసుకుంటున్నారని విద్యార్థి వర్గాలు మండిపడుతున్నాయి. ఏ విషయం జరిగినా గోప్యంగా ఉంచుతున్నట్లు పలువురు విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కోలుకుంటున్నారు: ప్రొఫెసర్ ఎస్ఏ కోరి, వీసీ

అస్వస్థతకు గురైన విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్యులతో పరీక్షలు చేయిస్తున్నాం. నెమ్మదిగా అందరూ కోలుకుంటున్నారు. ప్రస్తుతం వాతావరణం మార్పుల నేపథ్యంలోనే వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు. తాగునీరు, ఆహారం కలుషితం తో విద్యార్థులు అస్వస్థతకు గురికాలేదు. డీఎంహెచ్ఓ ఆధ్వర్యంలో వర్సిటీలో వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశాం.

మహిళ అదృశ్యం



మంగమ్మ

కూడేరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉదిరిపికొండ గ్రామానికి చెందిన మంగమ్మ అనే మహిళ అదృశ్యమయింది. పది రోజుల క్రితం ఆమె ఇంటి నుంచి వెళ్లిపోవడంతో బంధువులు, చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించామని, ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె భర్త సూర్యనారాయణ తెలిపారు. కేసు నమోదు చేసి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు ఏఎస్ఐ రామానాయుడు తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న విద్యార్థి

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తాను చదువుకుంటున్న స్కూల్‌ను మార్చారనే మనస్థాపం చెందిన ఓ విద్యార్థి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని నాయాల గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన సంజమ్మ, సుబ్రహ్మణ్యం దంపతుల కుమారుడు జగన్మోహన్ మండలంలోని మేడాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతుండేవాడు. ఈ క్రమంలో విద్యార్థి తల్లి సంజమ్మ రెండు రోజుల క్రితం మేడాపురం నుంచి పెనుకొండ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. అక్కడే ప్రభుత్వ హాస్టల్‌లో చేర్చారు. తాను అక్కడ చదువుకోవడానికి ఇష్టంలేదంటూ విద్యార్థి ఇంటికి తిరిగి వచ్చాడు. ఈ నేపథ్యంలో ఇంటిలో విషపు గుళికలు మింగాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి.. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ విద్యార్థి కోలుకుంటున్నట్టు బంధువుల ద్వారా తెలిసింది.



సాహితీశిఖరం గంగిశెట్టి కన్నుమూత


కాలిఫోర్నియాలో కొడుకు ఇంట తుదిశ్వాస
తనకల్లులో పుట్టి పెరిగిన లక్ష్మీనారాయణ
నివాళులు అర్పించిన సాహితీవేత్తలు



గంగిశెట్టి లక్ష్మీనారాయణ (ఫైల్)

అనంతపురం టౌన్/తనకల్లు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తనకల్లుకు చెందిన సాహితీవేత్త ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ కన్నుమూశారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో కుమారుడు వంశీ నివాసంలో ఆయన భారత కాలమానం ప్రకారం శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. గంగిశెట్టి లక్ష్మీనారాయణ 1947లో తనకల్లులో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు జింకా రుక్మిణమ్మ, జింకా గంగిశెట్టి దంపతులు. ఆయన చిన్నతనంలోనే తండ్రి మృతిచెందారు. తాత చెన్నరాయప్ప అన్నీ తానై పెంచి పెద్ద చేశారు. ఆయన విద్యాభ్యాసం తనకల్లు, కదిరి, హైదారాబాదులో కొనసాగింది. తెలుగులో ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ చేశారు. సంస్కృతంలో ఎంఏ, బీఈడీ చేశారు. బీఈడీలో ఉత్తమ ప్రతిభను కనబరచి, రెండు బంగారు పతకాలు అందుకున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. ఆయన ప్రభుత్వ ఉద్యోగంలో ఉండగా, అప్పటి విద్యుత్ శాఖమంత్రి అగిశం వీరప్ప వద్ద పీఏగా కొన్ని రోజులు పనిచేశారు. లక్ష్మీపార్వతికి తెలుగు నేర్పించారు. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో తులనాత్మక అధ్యయనశాఖ అధ్యక్షుడిగా పనిచేసి పదవీ విరమణ పొందారు. ద్రవిడ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా సేవలు అందించారు. రిటైర్డు అయిన తరువాత అందరికీ విద్యను అందించాలన్న ఉద్దేశంతో కిషోర్ స్కూల్‌ను స్థాపించారు. వివిధ కారణాలతో రెండేళ్లకే అది మూత పడింది. అనంతరం ఆయన అమెరికాలో ఉన్న కుమారుడి వద్దకు వెళ్లిపోయారు. ఆయన మృతికి పలువురు సాహితీవేత్తలు సంతాపం తెలిపారు.


అమ్మ మాట మీరే వారు కాదు



జింకా లక్ష్మీనారాయణ ఎంతో ఉన్నత పదవిలో ఉన్నా, అమ్మ రుక్మిణమ్మ మాట మీరే వారు కాదు. వారు ఇక్కడి నుంచి వెళ్లిపోయాక ఇంటిని అమ్మకానికి పె ట్టారు. కొనేందుకు ఎం తో మంది పోటీ పడ్డారు. కానీ రుక్మిణమ్మ వారి ఇంటిని నాకే అమ్మేందుకు ఇష్టపడ్డారు. ప్రతి సంవత్సరం నా భార్యకు ఆయన పుట్టింటి చీర అందించేవారు. ఆయన మరణం ఈ ప్రాంత ప్రజలకు తీరని లోటు.

– డాక్టర్ చలపతి నాయుడు, స్నేహితుడు

తీరని లోటు..



గొప్ప తాత్వికవేత్త, మహా పండితోత్తముడు ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ మృతి తెలుగు సాహిత్యానికి తీరని లోటు. ఉమ్మడి అనంతపురం జిల్లా గొప్ప సాహితీవేత్తను కోల్పోయింది. దశాబ్ద కాలంగా నేను చదివిన నవలల్లో 'పర్వ' నవల ఆకట్టుకున్నంతగా మరే నవలా ఆకట్టుకోలేదు. ఆయన వాక్యము, వాచకమూ గొప్ప తాత్విక చింతనతో పాఠకులను, సాహిత్య శ్రోతలను అగాధమైన భావనాలోకాల్లోకి తీసుకెళ్తాయి. ఇంకా పదికాలాలపాటు ఉండవలసిన విద్వన్మణి, విపశ్చిద్దంతి హఠాత్తుగా కానరానిలోకాలకు వెళ్లడం బాధాకరం.

– డాక్టర్ శాంతినారాయణ, విమలాశాంతి సాహిత్య సామాజిక సేవాసంస్థ వ్యవస్థాపకుడు

గర్వంలేని మనిషి..



ఒంగోలులో జరిగిన ఓ సాహితీ సభలో నాకు గంగిశెట్టి లక్ష్మీనారాయణతో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి సాహిత్య కార్యక్రమాలపై తరచూ ఫోన్‌లో మాట్లాడుకునేవాళ్లం. ఉమ్మడిశెట్టి అవార్డుకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మంచి గుర్తింపు ఉందని, దీనిని ఇలాగే కొనసాగించాలని ఆయన చెప్పిన మాటలు మరవలేను. సాహిత్య విమర్శపట్ల ఎంతో చొరవ చూపేవారు. ఎలాంటి గర్వం లేకుండా అన్ని వయసులవారిపట్ల ఎంతో అణకువగా వ్యవహరించేవారు. ఆయన నుంచి వర్తమాన సాహితీవేత్తలు నేర్చుకోవాల్సిన అంశాలు చాలా ఉన్నాయి.

– రాధేయ, కవి, ఉమ్మడిశెట్టి లిటరరీ ట్రస్టు వ్యవస్థాపకుడు

నేడే అన్నదాత సుఖీభవ జమ

జిల్లాలో 2,75,642 మంది రైతులకు అర్హత
రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.137.82 కోట్లు
పీఎం కిసాన్ ద్వారా రూ.53.63 కోట్ల లబ్ధి
ఎన్‌పీసీఐ సమస్యతో 7,802 మందికి పెండింగ్
అధికారుల నిర్లక్ష్యం..
పెండింగ్ జాబితా రైతుల్లో ఆందోళన



అనంతపురం అర్బన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): 'సూపర్ సిక్స్' హామీల అమలులో భాగంగా మరో ముందడుగు పడుతోంది. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ శనివారం ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా నేరుగా రైతుల ఖాతాలకు సొమ్మును జమ చేయనున్నారు. ఇందులో భాగంగా జిల్లా యంత్రాంగం ప్రతి నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేసింది. జిల్లా వ్యాప్తంగా 2,75,642 మంది రైతులను అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలకు అర్హులుగా గుర్తించారు. అర్హులైన రైతులకు ఈ పథకం ద్వారా రూ.137.82 కోట్లు, పీఎం కిసాన్ ద్వారా రూ.53.63 కోట్లు జమ కానుంది. మొత్తం రూ.191.45 కోట్లు రైతులకు లబ్ధి చేకూరనుంది. వైసీపీ ప్రభుత్వంలో ఏడాదికి రూ.13,500 రైతుల ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతల్లో, కేంద్రం మూడు విడతల్లో జమ చేసింది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద రూ.7,500, కేంద్ర ప్రభుత్వం వాటా రూ.6,000 జమ చేస్తూ వచ్చారు. గత ఎన్నికలకు ముందు చంద్రబాబు అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి పెట్టుబడి సాయం కింద రూ.20వేలు జమ చేస్తామని హామీ ఇచ్చారు. ఏడాదిలో మూడు విడతలుగా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్ము జమ చేయాలని నిర్ణయించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.14వేలు, కేంద్రం నుంచి రూ.6వేలు జమ చేయనున్నారు. ఈ ఏడాదిలో తొలి విడతలో రాష్ట్రం రూ.5వేలు, కేంద్రం రూ.2వేలు, రెండో విడతలో రాష్ట్రం రూ.5వేలు, కేంద్రం రూ.2వేలు, మూడో విడతలో రాష్ట్రం రూ.4వేలు, కేంద్రం రూ.2వేలు జమ చేయనుంది. తొలి విడతలో ఒక్కో రైతుకు రూ.7వేలు జమ కానుంది.

అన్నదాత సుఖీభవకు ఎన్‌పీసీఐ సమస్య

అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులకు ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) సమస్య వెంటాడుతోంది. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులుగా గుర్తించిన రైతుల్లో 7,802 మందికి ఎన్‌పీసీఐ పెండింగ్ ఉంది. అంటే బ్యాంక్ ఖాతాకు ఆధార్ లింక్ లేకపోవడంతో పెండింగ్‌లో జాబితాలో ఉండిపోయారు. అలాగే 5,674 మందికి ఈకేవైసీ రిజక్ట్ అయ్యింది. మరో 530 మంది రైతులతో ఈకేవైసీ చేయించాల్సి ఉంది. ఈకేవైసీతోపాటు ఎన్‌పీసీఐ సవ్యంగా ఉంటేనే అన్నదాత సుఖీభవ సొమ్ము జమ అవుతుంది. ఈ నేపథ్యంలో ఎన్‌పీసీఐ, ఈకేవైసీ పెండింగ్‌లోని రైతులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత వ్యవసాయ యంత్రాంగం ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా పనిచేసే ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్న వాదనలు వినిపిస్తున్నాయి. అత్యధికంగా కళ్యాణదుర్గంలో 569 మంది రైతులకు ఎన్‌పీఐసీ పెండింగ్‌లో ఉంది. రాప్తాడులో 432, పుట్లూరు 366, గుంతకల్లు 367, విడపనకల్లు 459, గుమ్మగట్ట 303, డి.హిరేహాల్ 240, శెట్టూరు 230, బెలుగుప్ప 250, రాయదుర్గం 235, ఉరవకొండ 216, కూడేరు 344, బుక్కరాయసముద్రం 203, వజ్రకరూరు 237, కంబదూరు 351, పామిడి 243, పెద్దవడుగూరు 218 మంది రైతులకు ఎన్‌పీసీఐ పెండింగ్‌లో ఉంది. మిగిలిన మండలాల్లోను పలు గ్రామాలకు చెందిన రైతుల ఎన్‌పీసీఐ పెండింగ్‌లో ఉంది. సంబంధిత రైతులకు సమాచారం అందించడంతోపాటు బ్యాంకర్లను సంప్రదించి, పెండింగ్‌లోని ఎన్‌పీసీఐని పూర్తి చేయడంలో పలు మండలాల అధికారులు నిర్లక్ష్య వహించారన్న విమర్శలు ఉన్నాయి. ఈ విషయంపై జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ పలు మండలాల ఏఓలపై టెలికాన్ఫరెన్స్‌లో సీరియస్ అయ్యారు. అన్నదాత సుఖీభవ ఈనెల 2వతేదీ ప్రారంభమవుతుందని తెలిసినా, ఎన్‌పీసీఐ, ఈకేవైసీని పూర్తి చేయించలేకపోవడంపై నిర్లక్ష్యం వహించడం పలు విమర్శలకు తావిస్తోంది.

అంకుల్..! మా నాన్న ఎప్పుడొస్తారు ?

అమాయకంగా ప్రశ్నిస్తున్న పిల్లలు
ఖతర్‌లో తనకల్లు వాసి మృతి
శోకసంద్రంలో తల్లి, భార్య
మృతదేహాన్ని తెప్పించేందుకు ప్రయత్నాలు



విషాదంలో నూరుల్లా కుటుంబ సభ్యులు

తనకల్లు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తండ్రి మరణ వార్త తెలియని చిన్నారులు అంకుల్..! మానాన్న ఎప్పుడొస్తారు? అని ప్రశ్నించడం అక్కడున్న వారందరినీ కలిచివేస్తోంది. తనకల్లుకు చెందిన నూరుల్లా (36) ఖతర్‌లోని వకారాలో గురువారం మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఆ కుటుంబం తీవ్ర దుఃఖంలో మునిగిపోయింది. విలపిస్తున్న తల్లి, నానమ్మ, బంధువులను చూసి వీరంతా ఎందుకు ఏడుస్తున్నారు? అసలు ఏమైందని ఆ పిల్లలు అడుగుతుండటంతో అక్కడున్న వారికి కన్నీరు ఆగడం లేదు. మృతుడు నూరుల్లాకు నాలుగో తరగతి చదువుతున్న అయేషా, ఆరోతరగతి చదువుతున్న షానీకౌర్ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అప్పు తీర్చడానికి వెళ్లి...

కరోనా సమయంలో బతుకుతెరువు కోసం నూరుల్లా ఓ ఐషర్ వాహనం కొనుగోలు చేశాడు. అయితే అందులో నష్టాలు రావడంతో రూ.10 లక్షలు అప్పు మిగిలింది. దీంతో ఇక్కడే ఉంటే అప్పులు తీర్చలేనని భావించి, ఇంట్లో భార్య, తల్లిని ఒప్పించి ఖతర్ దేశానికి వెళ్లాడు. అక్కడ వకారా నగరంలో ఓ యజమాని వద్ద డ్రైవర్‌గా పనికి చేరాడు, మూడు సంవత్సరాల 4నెలలుగా అక్కడే పని చేస్తున్నాడు. ఈక్రమంలోనే చేసిన అప్పులన్నీ తీర్చేశాడు. ఇంకో నెల రోజులు పని చేసి అంతో ఇంతో డబ్బులు చేతపట్టుకుని ఇంటికి రావాలనుకున్నాడు. ఇదే విషయాన్ని నాలుగు రోజుల కిందట తల్లి ఫరీయాద్, భార్య షాబాజీకి ఫోన్ చేసి చెప్పాడు. ఇంతలో ఏమైందో ఏమో తెలియదుకానీ, అతడితో కలిసి పని చేస్తున్న మరో డ్రైవర్ ప్రమాదంలో నూరుల్లా గురువారం మృతి చెందినట్లు సమాచారం అందించారు. దీంతో కుంటుంబం, స్నేహితులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతదేహాన్ని ఖతర్ నుంచి తీసుకురావడానికి ఎమ్మెల్యే, మంత్రుల సాయం కోరనున్నట్లు గ్రామంలోని యువకులు తెలిపారు.

నెల రోజుల్లో వస్తానంటివే...

అప్పులన్నీ తీరిపోయాయి. ఇంకో నెల రోజుల్లో జీతం తీసుకుని ఇంటికి వస్తానని ఫోన్‌లో చెబితేవే. ఇంతలోనే ఇలాంటి వార్తను పంపావా. నీవు లేకుండా బతికేదెలా? నాకు, నాబిడ్డలకు ఇంక దిక్కెవరు? అంటూ మృతుడి భార్య షాబాజీ కన్నీరు మున్నీరయ్యారు.

ఏమీ కాలేదంటివి కద నాన్నా..!

అమ్మ నేనున్నాను. ఎలాంటి ఆందోళన వద్దు. నేను చూసుకుంటానని, ఫోన్‌లో కుమారుడు చెప్పిన మాటలు తలుచుకుంటూ తల్లి ఫరియాద్ బోరున విలపించారు. ఫోన్ చేసినప్పుడు కుమారుడి గొంతులోని తేడాను గుర్తించి ఏమైందిరా? అలా ఉన్నావని అడిగితే, ఏమీ కాలేదమ్మ, జ్వరం వస్తోందని, అయినా డ్యూటీకి వచ్చినట్లు చెప్పాడని ఆమె విలపించారు. ఆరోగ్యం బాగాలేనప్పుడు రెస్టు తీసుకోకూడదా అంటే నెలరోజుల్లో ఇంటికొస్తాను కదమ్మా, అంతో, ఇంతో కుటుంబ పోషణ కోసం డబ్బులు తెచ్చుకోవాలి కదా అందుకే డ్యూటీ చేస్తున్నట్లు చెప్పాడని బోరుమన్నారు.

జిల్లా పరీక్షల విభాగం ఏసీ బాధ్యతల స్వీకరణ



డీఈఓను కలిసిన నూతన ఏసీ వెంకటేష్

అనంతపురం విద్య, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్(ఏసీ)గా వెంకటేష్ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సాధారణ బదిలీల్లో ఇక్కడ ఉన్న ఏసీ గోవిందనాయక్ కర్నూలు జిల్లాకు బదిలీకాగా, కడప జిల్లాలో పని చేస్తున్న ఏసీ వెంకటేష్‌ను అనంతపురం జిల్లాకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. బదిలీ ఉత్తర్వులు నెల కిందటే వచ్చినా పరీక్షల నిర్వహణకు సంబంధించిన వివిధ రకాల బిల్లుల సబ్మిట్ చేయడానికి ఎక్కడవాళ్లు అక్కడ ఉండటానికి అవకాశం కల్పించారు. ఆ పక్రియ ముగియడంతో ప్రభుత్వ బదిలీ ఉత్తర్వుల మేరకు వెంకటేష్ శుక్రవారం జిల్లాకు వచ్చారు. డీఈఓ ప్రసాద్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా విద్యాశాఖ ఏసీగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు విద్యాశాఖ సిబ్బంది, పలువురు హెచ్‌ఎంలు, ప్రైవేట్‌స్కూల్స్ కరస్పాండెంట్లు అభినందనలు తెలిపారు.

రేపు జిల్లా స్థాయి యోగాసన పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి యోగాసన చాంపియన్‌షిప్-2025 పోటీలు ఈనెల 3వతేదీన ఉరవకొండలో నిర్వహించనున్నట్లు జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్ రెడ్డి, రవికాంత్ రమణ తెలిపారు. 10-55 సంవత్సరాల వయస్సులోపు ఉన్నవారు అర్హులని అన్నారు. యోగాసనా భారత్ నిబంధనల ప్రకారం ఈ పోటీలలో గెలుపొందిన విజేతలు రాష్ట్రస్థాయి, ఖేలో ఇండియా యోగాసన పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9440288899, 9963028694లను సంప్రదించాలని తెలిపారు.

ఉత్తమ టీచర్ అవార్డుకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం విద్య, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని సెప్టెంబరు 5న అందించే రాష్ట్ర స్థాయి ఉత్తమ టీచర్ల అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్, ఏపీఎంఎస్, ఏపీటీడబ్ల్యూఆర్ఈఎస్, ఏపీఆర్ఈఎస్, కేజీబీవీ, డైట్ స్కూళ్లలో పనిచేస్తున్న టీచర్లు, హెచ్‌ఎంలు ఇందుకు అర్హులని అన్నారు. 10 ఏళ్ల బోధన అనుభవం తప్పనిసరిగా ఉండాలన్నారు. రాష్ట్రస్థాయి అవార్డుకు దరఖాస్తు చేసేవారు జిల్లా అవార్డు పొంది ఉండాలన్నారు. గతంలో రాష్ట్రస్థాయి అవార్డు తీసుకున్నవారు మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం లేదన్నారు. ఈనెల 12వ తేదీలోగా దరఖాస్తులను పూరించి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఎఫ్‌ఏ-1 పరీక్షల షెడ్యూల్‌లో మార్పు

అనంతపురం విద్య, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరంలో తొలిసారిగా జరగనున్న ఎఫ్ఏ-1 పరీక్షలు వాయిదా పడ్డాయి. గతంలో ఈనెల 4 నుంచి ఏడో తేదీవరకు ఈపరీక్షలు నిర్వహి స్తామని రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఆదేశాలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే పరీక్షలకు సంబంధించిన సామగ్రి సరఫరా కాకపోవడంతో ఎఫ్ఏ-1 పరీక్షల షెడ్యూల్‌ను మారుస్తూ శుక్రవారం ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టరు వెంకటకృష్ణారెడ్డి ఆదేశాలు జారీ చేసినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, డీసీఈబీ సెక్రటరీ గంధం శ్రీనివాసులు వెల్లడించారు. కొత్త షెడ్యూల్ ప్రకారం ఈనెల 11వ నుంచి 14వరకు ఎఫ్ఏ-1 పరీక్షలు నిర్వహిస్తామని వారు తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, ఆశ్రమ పాఠశాలల యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులు ఈ విషయాన్ని హెచ్‌ఎంలకు తెలియజేయాలని ఆదేశించారు.

జీడిపల్లికి పెరిగిన ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో పెరిగింది. శుక్రవారం 2156 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అవుట్‌ఫ్లో 2116 క్యూసెక్కులు ఉందన్నారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.773 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వెల్లడించారు.

ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన

బుక్కరాయసముద్రం,ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): రానున్న ఐదు రోజుల్లో ఉమ్మడి జిల్లాలో తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తానారాయణస్వామి తెలిపారు. గరిష్ఠ ఉష్ణోగ్రత 35.2-35.8డిగ్రీల సెల్సియస్‌గా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 24.12-24.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కావచ్చని తెలిపారు. అనంతపురం జిల్లాలో 2న 0.3 మి.మీ, 3న 0.8 మి.మీ 4న 0.7 మి.మీ, 5న 0.2 మి.మీ 6న 5.6. మి.మీ వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో 2న 2.2 మి.మీ, 3న 2.8 మి.మీ 4న 2.1 మి.మీ, 5న 3.9 మి.మీ 6న 10.2మి.మీ కురిసే అవకాశం ఉందన్నారు.

టీటీసీ సర్టిఫికెట్లు తీసికెళ్లండి: డీఈఓ


అనంతపురం విద్య, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): టీటీసీ(టెక్నికల్ టీచర్స్) సర్టిఫికెట్లు వచ్చాయని, సంబంధిత అభ్యర్థులు వచ్చి తీసుకెళ్లాలని డీఈఓ ప్రసాద్ బాబు శుక్రవారం ఓప్రకటనలో తెలిపారు. టీటీసీ -2024కి సంబంధించి డ్రాయింట్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ గ్రేడ్ టెక్నికల్ పరీక్షలు గతేడాది ఆగస్టులో జరిగాయన్నారు. ఈ పరీక్షలు రాసి, ఉత్తీర్ణులైన అభ్యర్థులకు సర్టిఫికెట్లు వచ్చాయన్నారు. అభ్యర్థులు హాల్‌టిక్కెట్, ఆధార్‌కార్డు తీసుకొని వచ్చి జిల్లాకార్యాలయంలో ఉన్న టీటీసీ సర్టిఫికెట్లు తీసుకెళ్లాలని సూచించారు.

టమోటాలు కిలో రూ.34


అనంతపురంరూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శుక్రవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.34తో అమ్ముడుపోయాయి. అదే విధంగా కనిష్ఠంగా రూ.24, సరసరిగా రూ.28తో విక్రయాలు జరిగాయి. మార్కెట్‌కు మొత్తంగా 3,600 టన్నుల టమోటాలు వచ్చాయని రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు.

చీనీ టన్ను రూ.14వేలు

అనంతపురంరూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి ధర రూ.10,100 పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 1221 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.



బంగారం కొనబడును



మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్‌క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్‌డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ.సంప్ర:7382114647

AJA- Sathish

ఉచిత విద్యావకాశాలు

ఇంటర్‌పాస్ స్టూడెంట్స్‌కి B.Sc (Nursing). B.Sc (MLT),BPT (ఫిజియోథెరపీ) GNM (Nursing) DMLT (బ్లడ్‌టెస్ట్ కోర్సు) Goverment సీట్స్‌కి అడ్మిషన్లు జరుగుచున్నవి. ఫ్రీ ఎడ్యుకేషన్ మరియు ఫ్రీ హాస్టల్ కలదు. సంప్ర: జి.మురళి,అనంతపురం సెల్ :9030661651.

AJA- 237933



సువర్ణ అవకాశం

ఇంటి దగ్గర ఉంటూ ఉద్యోగులు, నిరుద్యోగులు, రిటైర్మెంట్ వారు ప్రతి నెల 30వేల నుండి 50 వేలు ఆపైన సంపాదించుకునే అవకాశం. కోర్సు మేము నేర్పిస్తాం. పాన్ కార్డు తప్పనిసరి. సంప్రదించండి: 9550360602.

AJA- 237934

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

న్యూస్ బాక్స్

పెద్దమ్మతల్లికి వేపాకుతో అలంకరణ



ధర్మవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాలేవీధిలోని వెలసిన పెద్దమ్మతల్లి శ్రావణ శుక్రవారం సందర్భంగా అర్చకులు వెంకటేశశర్మ అమ్మవారికి వేపాకు అలంకరణ చేశారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాలతో విశేషమంగళద్రవ్యాలతో అభిషేకం చేశారు. లలితా సహస్రనామ పారాయణం చేశారు. బుగ్గ వంశస్థుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

అర్చక కుటుంబాన్ని ఆదుకోవాలి



మాట్లాడుతున్న అర్చకులు

కదిరి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఊరుకుంద ఈరన్నస్వామి ఆలయ అర్చకులు పూజన్నస్వామి కుటుంబాన్ని ఆదుకోవాలని అర్చక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య, ఖాద్రీక్షేత్ర బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం, అర్చక సంఘం ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఊరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్న పూజన్న స్వామి ఆలయ ఈఓ విజయరాజు వేధింపుల కారణంగానే ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. ఆయన ఆత్మహత్యకు కారకులైనవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అర్చకులు కుమార్‌రాజా, శివరాం, బాబాప్రకాష్, తాతాయ్య శాస్త్రి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టని ప్రభుత్వాలు: సీపీఐ



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య

ధర్మవరం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు రామచంద్రయ్య విమర్శించారు. స్థానిక పోతుకుంట రోడ్‌లో ఉన్న ఎస్ఆర్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం సీపీఐ 2వ జిల్లా మహాసభలను నిర్వహించారు. మొదట పార్టీ జెండాను నాయకులు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలపక్షాన నిలబడి ఉద్యమాలు చేపట్టి వాటిని పరిష్కరించే పార్టీ సీపీఐ అన్నారు. రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్, జిల్లాకార్యదర్శి వేమయ్యయాదవ్, నియోజకవర్గ కార్యదర్శి మధు, జింకాచలపతి, జాన్సన్, కాటమయ్య పాల్గొన్నారు.

సమస్యల సాధనకు ఉద్యమాలే శరణ్యం



నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

నంబులపూలకుంట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల సాధనకు ఉద్యమాలే శరణ్యమని జిల్లా కార్టో చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. పీఆర్సీ కమిటీని నియమించి మధ్యంతర భృతి 30శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. 18 డిమాండ్ల సాధనకు శనివారం కలెక్టరేట్ వద్ద ధర్నాకు పిలుపు నిస్తున్నామన్నారు. శివయ్య, వెంకటరామిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, శంకర్, ముషీర్ అహ్మద్, హరిప్రసాద్, పూర్ణానందరెడ్డి, రామమోహన్, లాలూసాబ్, జ్యోతి, వరలక్ష్మి పాల్గొన్నారు.

డిజైనర్ నాగరాజుకు సన్మానం



నాగరాజును సన్మానిస్తున్న టీడీపీ, బీజేపీ నాయకులు

ధర్మవరం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): చేనేత డిజైన్ డెవలప్‌మెంట్ జాతీయ అవార్డు గ్రహీత అయిన డిజైనర్ నాగరాజును ఆయన స్వగృహంలో శుక్రవారం బీజేపీ నాయకులు సన్మానించారు. గోనుగుంట్ల సూర్యనారాయణ ఫోన్‌ద్వారా నాగరాజుకు శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ లీగల్ సెల్ కోశాధికారి అంజనరెడ్డి, సాహెబ్బీ, గిరిధర్, నారాయణస్వామి యాదవ్, రాము, జగదీశ్, గంధమనేని నారాయణస్వామి, గోపాలకృష్ణ, రంగనాయకులు, శీన, బాబు, మ ధు, పోతలయ్య, నాగరాజు, కిష్ట, నారాయణ, వీరనారప్ప, బాలాజీ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించడమే ధ్యేయం

బత్తలపల్లి, ఆగస్టు 1(ఆంధ్రజోతి): ప్రజా సమస్యలు పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ నాయకులు అన్నారు. మండలంలోని మాల్యవంతం గ్రామంలో శుక్రవారం మీ సమస్య మా బాధ్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కన్వీనర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. 102 అర్జీలను ప్రజలు అందజేసినట్లు ఆయన తెలిపారు.

రక్తదాన శిబిరం

ధర్మవరం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీసాయి డిగ్రీకళాశాలలో రక్తదాన శిబిరాన్ని శుక్రవారం యువర్స్ ఫౌండేషన్, చౌడేశ్వరి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించారు. 30 మందివిద్యార్థులు రక్తదానం చేశారు. కరస్పాండెంట్ చాంద్‌బాషా, ప్రిన్సిపాల్ ఫణికుమార్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

సమస్యల పరిష్కారంపై శ్రీరామ్ చొరవ అభినందనీయం

● మంత్రి సత్యకుమార్ యాదవ్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి సత్యకుమార్, పరిటాలశ్రీరామ్, చిలకం

ధర్మవరం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారంలో పరిటాల శ్రీరామ్ చూపుతున్న చొరవ అభినందనీయమని వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 35వ వార్డులో శుక్రవారం మీ సమస్య-మా బాధ్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రిసత్యకుమార్, పరిటాలశ్రీరామ్, చిలకంమధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఉన్నతాధికారులతో మంత్రి ఫోన్‌లో మాట్లాడి ప్రజల సమస్యలను వారికి వివరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలోని కాలేజ్ సర్కిల్ వద్ద మన ధర్మవరం గార్డెన్ ప్రారంభోత్సవంలో వారు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ... దాతలు సంధా రాఘవ, సాయిలను దీని నిర్మాణంలో కీలకంగా ఉన్నారన్నారు. అనంతరం మన ధర్మవరం సిల్క్-సిల్క్‌సిటీ అనే బోర్డుతో పాటు లవ్ అండ్ లెట్ ఈజ్ కీప్ఇట్ క్లీన్ అనే సెల్ఫీ పాయింట్‌ను నిర్మించారు. ఏపీ సీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ చింతలపల్లి మహేశ్‌చౌదరి, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, నాయకులు సంధా రాఘవ, ఫణికుమార్, పురుషోత్తంగౌడ్, నాగూర్‌హుస్సేన్, భీమనేని ప్రసాద్‌నాయుడు, రాళ్లపల్లి షరీఫ్, జింకల రాజన్న, బొట్టు కిష్ట, కొత్తపేట ఆది, జింకా పురుషోత్తం, మాధవరెడ్డి, కరెంటుఆది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి: పర్యావరణ పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం అవసరమని మంత్రి సత్యకుమార్‌యాదవ్ అన్నారు. పట్టణంలోని గాంధీనగర్ పార్కులో ఆయన మొక్కలు నాటారు. నేటి చెట్టు రేపటి శ్వాస అన్న నినాదంతో ప్రజలను మొక్కల పెంపకంలో భాగస్వామ్యం కావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో చిలకం మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్‌కమిషనర్ ప్రమోద్‌కుమార్, టీడీపీనాయకులు కత్తుల బాబ్జీ, భాస్కర్‌చౌదరి పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డు అభివృద్ధికి కృషి చేయండి

ధర్మవరంరూరల్: ధర్మవరం మార్కెట్‌యార్డు అభివృద్ధికి కృషిచేయాలని నూతన కమిటీకి మంత్రి సత్యకుమార్‌యాదవ్ సూచించారు. టీడీపీ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్, జనసేన నాయకుడు చిలకం మధుసూదన్‌రెడ్డితో కలిసి స్థానిక వ్యవసాయమార్కెట్‌యార్డులో నూతన కమిటీతో సమావేశమయ్యారు. ముందుగా నూతనకమిటీకి అభినందనలు తెలిపారు. అనంతరం మార్కెట్‌యార్డు అభివృద్ధికి ప్రణాళికలు రచించాలని, రైతులకు, పాడిరైతులకు, వ్యాపారస్థులకు, ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ అంబటి అరుణశ్రీ, వైస్ చైర్మన్ అయ్యప్ప, సెక్రటరీ నాగేంద్రకుమార్, డైరెక్టర్లు చిగిచెర్ల రాఘవరెడ్డి, గొట్లూరు ఆజాద్ పాల్గొన్నారు.

అత్యధిక పింఛన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్

● మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): దేశంలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అత్యధిక పింఛన్‌సొమ్మును అందచేస్తున్న ఏకైక



పింఛన్లు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి

రాష్ట్రం ఏపీ అని మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో నూతనంగా మంజూరైన 68 వితంతు పింఛన్లు ఆయన పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇంటి పెద్దదిక్కును కోల్పోయి ఒంటరిగా ఉంటున్న మహిళలను ఆదుకోవాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబు ఎన్టీయార్‌భరోసా పింఛన్లను ఆగస్టు 1 నుంచి అందజేసి వారిలో ఆత్మస్థైర్యం నింపేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. నియోజకవర్గంలోని 77 సచివాలయాల పరిధిలో 678 నూతన పింఛన్లను మంజూరయ్యాయన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా అన్నదాతా సుఖీభవ పథకంలో భాగంగా కూటమి ప్రభుత్వం 20వేల రూపాయలు మూడు విడతల్లో అందించే కార్యక్రమాన్ని తొలివిడతగా 7వేలు రైతుల ఖాతాల్లో జమచేయనుందన్నారు. మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ బెస్తచలపతి, కన్వీనర్ రామాంజనేయులు, సామకోటి ఆదినారాయణ, కౌన్సిలర్ వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

వసతి గృహం తనిఖీ

నంబులపూలకుంట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ బాలుర వసతి గృహాన్ని శుక్రవారం బీసీ వెల్ఫేర్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రాజేంద్ర కుమార్‌రెడ్డి తనిఖీ చేశారు. వసతి గృహం అభివృద్ధికి నిధులు లేకపోయినా పంచాయతీ సహకారంలో తాగునీటి సమస్య కొనసాగుతోందన్నారు. అభివృద్ధికి అవసరమైన నిధులకోసం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా, సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఏబీసీడబ్ల్యూ బాలాజీ, వార్డన్ పెద్దన్న పాల్గొన్నారు.

రేపు జూడో ఎంపిక పోటీలు

కొత్తచెరువు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి జూడో ఎంపిక పోటీలు ఆదివారం ఉదయం 9 గంటలకు చిగిచెర్ల జడ్పీ హైస్కూల్ క్రీడామైదానంలో నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ సెక్రటరీ భాస్కర్‌నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూడోలో నైపుణ్యం ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాస్థాయిలో ఎంపికైనవారిని ఎంసీబీ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో 9, 10తేదీలలో స్టేట్ సెలక్షన్స్‌కు పంపుతారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ధర్మవరంరూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్ చౌడమ్మగుడి పెట్రోల్‌బంకు సమీపంలో ద్విచక్రవాహనంలో వెళ్లుతున్న ఓ వ్యక్తిని వెనుకవైపు నుంచి లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పట్టణపోలీసులు తెలిపిన మేరకు చిన్నూరుగ్రామానికి చెందిన ఓబిలేసు ద్విచక్రవాహనంలో శాంతినగర్ వైపు వెళుతుండగా చౌడమ్మగుడి సమీపంలోకి రాగానే వెనుకవైపు నుంచి లారీ ఢీకొట్టింది. దీంతో ఓబిలేసు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని స్థానికులు ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్సకోసం అనంతపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గుప్తనిధుల వేటగాళ్ల అరెస్టు

నల్లమాడ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): గుప్తనిధుల వేటగాళ్లను గురువారం అరెస్టు చేసినట్లు సీఐ నరేంద్రరెడ్డి శుక్రవారం తెలిపారు. రైస్‌పుల్లింగ్ చూపించి భూమిలో ఉన్న గుప్తనిధులను బయటకు తీయవచ్చని మండలంలోని ఎద్దులవాండ్లపల్లి తండాకు చెందిన భాస్కర్‌నాయక్, తెలంగాణ రాష్ట్రం ఖమ్మంకు చెందిన ఎండీ అక్బర్‌బాషా, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన ఆవుల ప్రసాద్, విజయవాడకు చెందిన కార్తికేయ చైతన్య కనగానిపల్లికి చెందిన సుందర వీరన్నలు ఎద్దువాలండ్లపల్లి తండా సమీపంలో అనుమానాస్పందగా తిరుగుతుండగా తండా వాసులు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు సీఐ తెలిపారు. వారి పట్టుకుని విచారించి అరెస్టు చేశామన్నారు. వారినుంచి కారు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కారు ఢీకొని యువకుడి మృతి

కదిరి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. పట్టణంలోని అడపాల వీధికి చెందిన జేఎస్ ఫహీం అహమ్మద్(18) అనే యువకుడు గురువారం రాత్రి పాండా మార్కెట్ వద్ద నడుచుకుంటూ వెళుతుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో మృతిచెందినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం ఫహీం అహ్మద్ తండ్రి అబ్దుర్ రసూల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

తనకల్లు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాను శుక్రవారం ఆవిష్కరించారు. 17వ తేదీన మందక్రిష్ణమాదిగ సత్యసాయి జిల్లాకు రానుండటంతో ప్రతి ఒకరు కార్యక్రమంలో పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, విశ్వనాథ్, తోపు పారేసు, నరసింహులు, మహేష్, భాస్కర్, వెంకటరామప్ప, కదిరమ్మ పాల్గొన్నారు.

నేడు రైతుల ఖాతాల్లోకి అన్నదాతా సుఖీభవ సొమ్ము

కదిరి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 44,981మంది రైతుల ఖాతాల్లో శనివారం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ద్వారా జమ కానున్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరవుతారని తెలిపారు. కదిరి నియోజకవర్గంలో 44,981మంది రైతులకు రూ.30కోట్ల 63లక్షల నిధులు మొదటివిడతగా జమ అవుతాయన్నారు. ఇందులో తనకల్లు 10,278మంది రైతులకు రూ.703లక్షల, గాండ్లపెంట 5,269మందికి రూ.360లక్షలు, తలుపుల 9,254, రూ.639, నల్లచెరువు 6,030 రూ.410, కదిరి 7,492 రూ.498, ఎన్పీకుంట 6,658మంది, రూ.453లక్షలు రైతుల ఖాతాలో జమ చేసినట్లు చెప్పారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి

ముదిగుబ్బ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని సీపీఎం, సీఐటీయూ, ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ నారాయణ స్వామికి శుక్రవారం వినతిపత్రం అందించారు. పది సంవత్సరాల నుంచి శ్మశాన వాటిక కోసం అర్జీల రూపంలో ఎన్నోసార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించలేదన్నారు. మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, బండల వెంకటేష్, బాబ్జాన్, పక్కీరప్ప, టైలర్ ముత్తు, రహీమ్ పాల్గొన్నారు.

పోలీసులు ఆరోగ్యంగా ఉండాలి

పుట్టపర్తి రూరల్, ఆగష్టు 1(ఆంధ్రజ్యోతి): పోలీసులు ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు మెరుగైన సేవలందిస్తారని జిల్లా ఎస్పీ వి. రత్న అన్నారు. శుక్రవారం ఎస్పీ ఆదేశాలతో జిల్లాలో విధులు నిర్వహిస్తున్న ఏఆర్, సివిల్ పోలీసు సిబ్బందికి ఆరోగ్య పరీక్షల కార్యక్రమాన్ని చేపట్టారు. శ్రీసత్యసాయిసూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌లో వైద్యసిబ్బంది సమగ్ర ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. ప్రతి రోజు వంద మందికి వైద్యపరీక్షలు నిర్వహించనున్నారు.

90 నూతన పింఛన్ల పంపిణీ

ధర్మవరం రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని స్పౌజ్ కేటగిరీ కింద నూతనంగా 90 పింఛన్లు మంజూరు కావడంతో వాటిని శుక్రవారం సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికి వెళ్లి అందజేసినట్లు ఎంపీడీఓ సాయిమనోహర్ తెలిపారు. ఆయా గ్రామాల్లో టీడీపీ నాయకులు పింఛనుదారుల ఇళ్ల వద్దకు వెళ్లి నగదు అందజేశారు. గొట్లూరులో శ్రీనివాసులు, ఉప్పునేసినపల్లిలో సర్పంచ్ ముత్యాలప్పనాయుడు, నంబూరిశివ, గరుడంపల్లిలో నాగానంద, చెలిమి అంజి, ఏజ్జిపోతలయ్య, వెంకటేష్ లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

ఉమ్మడి భూములను సంరక్షించండి

ఓబుళదేవరచెరువు, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి భూములు ఆక్రమణకు గురికాకుండా రక్షించాలని ఇనగలూరు సర్పంచ్ బాబాఫక్రుద్దీన్ శుక్రవారం ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసరెడ్డికి విన్నవించారు. మండలంలోని ఇనగలూరు, వెంకటాపురం, టి.కుంట్లపల్లి తదితర పంచాయతీల్లో ఉమ్మడి భూములను సంరక్షించుకుని అభివృద్ధి చేసేందుకు సర్పంచ్ కృషి చేస్తున్నట్లు చెప్పారు. కొండగుట్టలకు సరిహద్దులు నిర్ణయించి ఇవ్వాలన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలలో 6, 7 చదువుతున్న విద్యార్థులకు టీడీపీ మహిళ నాయకురాలు వాల్మీకి నాగవేణి విద్యాసామాగ్రి శుక్రవారం అందించారు. శనివారం ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి జన్మదినం సందర్భంగా విద్యార్థులకు తమ వంతు సహకారం అందించినట్లు చెప్పారు. నాయకులు మునాఫ్, నాగేంద్ర, సుధాకర్, రమణ, శ్రీనివాస్, ఖాదర్‌బాషా, దస్తగిరి, లక్ష్మీనర్సు, బాషా పాల్గొన్నారు.



నోటుపుస్తకాలు అందచేస్తున్న నాగమణి

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం: పీడీ



బీడుపల్లిలో మొక్కనాటి నీరుపోస్తున్న ఐసీడీఎస్ పీడీ ప్రమీల

పుట్టపర్తిరూరల్, ఆగష్టు 1(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని అప్పుడే పుట్టిన చిన్నారికి అరగంటలోపే బిడ్డకు పాలు పట్టించాలని ఐసీడీఎస్ పీడీ ప్రమీల సూచించారు. శుక్రవారం బీడుపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం-1లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సీడీపీఓ జయంతి, సూపర్‌వైజర్ సుజాత కార్యకర్తలు మంజుల, జ్యోతి, ఏఎన్ఎంలు ఆశాలు పాల్గొన్నారు.

మొక్కను బిడ్డల్లా సంరక్షించాలి: కడుపున పుట్టిన బిడ్డలను తల్లి ఎలా కాపాడుకుంటుందో అలాగే మొక్కలను కాపాడాలని పీడీ ప్రమీలా అన్నారు. మామిళ్ళకుంట కూడలిలో నవజాతశిశువు ఇంటి వద్ద నిర్వహించిన మొక్కల నాటే కార్యక్రమానికి పీడీ హాజరై మొక్కను నాటారు.

తనకల్లు: ముర్రుపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ న్నారు. శుక్రవారం మండలంలోని కొక్కంటి దళితవాడ(పోతుపాల్యం)లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 7వ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. ముర్రుపాల ప్రాముఖ్యత, తల్లిపాలు ఇచ్చే విధానంపై బాలింతలు గర్భిణులకు అవగాహన కల్పించారు. సీహెచ్‌వో స్వర్ణలత, ఏఎన్ఎం గిరిజా లక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్ పుష్పలత పాల్గొన్నారు.

బత్తలపల్లి: పుట్టిన ప్రతి శిశువుకు తల్లిపాలు శ్రీరామ రక్ష అని సీడీపీఓ సరస్వతి అన్నారు. శుక్రవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సూపర్‌వైజర్ ఎర్రమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. అనంతరం ఆర్డీటీ వైద్య సిబ్బంది ఆర్డీటీ ఆస్పత్రి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. వైద్యులు దశరథ్, శిరీష, యశ్వంత్ పాల్గొన్నారు.

ధర్మవరం: మండలంలోని రేగాటిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ముర్రుపాల ప్రాముఖ్యత, తల్లిపాలు ఇచ్చే విధానంపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: ఎమ్మెల్యే

నల్లచెరువు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. శుక్రవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని బసవన్న కట్ట వద్ద అధికారులు ఏర్పాటు చేసిన పింఛన్ పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కన్వీనర్ రాజశేఖర్‌బాబు ఆధ్వర్యంలో అధికారులు ఎమ్మెల్యేకి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. లబ్ధిదారులకు ఎమ్మెల్యే పింఛన్లు అందించారు. ఆయన మాట్లాడుతూ 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. రైతులకు అన్నదాతా సుఖీభవ సొమ్ము జమచేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేకాధికారి సూర్యనారాయణ, తహసీల్దార్ జమానుల్లాఖాన్, ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా, మాజీ ఎంపీపీలు మబూసాబ్, శివారెడ్డి, నాగభూషణ నాయుడు, గుత్తా ప్రసాద్, సర్పంచ్‌లు హర్షవర్ధన్ నాయుడు, పంచ రత్నమ్మ, నాగరాజు, అశ్వత్థనాయుడు, నాయకులు వెంకటరమణ, కిరణ్‌కుమార్‌నాయుడు, సతీష్ చౌదరి, తవళం వేణురాయల్, దేవేంద్రగౌడ్, కావడి ప్రవీణ్‌కుమార్, జక్కా లక్ష్మీనారాయణ, గోపెన రాంప్రసాద్, ఫయాజ్ పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కదిరిఅర్బన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళసముద్రంలో శుక్రవారం క్షయవ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. పురవీధుల్లో ర్యాలీ చేశారు. సూపర్‌వైజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ రెండువారాలకు మించి దగ్గు, సాయంత్రం పూట జ్వరం, ఆకలి లేకపోవడం, గల్లలో రక్తం పడటం, బరువు తగ్గడం, గొంతుకింద గడ్డలు, అలసట లక్షణాలు కనిపిస్తే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గల్ల పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశకార్యకర్త రమాదేవి పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపిక



మధుసూదన్, కేశవయ్య

బత్తలపల్లి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇద్దరు యువకులు కానిస్టేబుల్‌గా ఎంపిక అయ్యారు. పోట్లమర్రికి చెందిన ఆంజినేయులు కుమారుడు మదుసూదన్ కానిస్టేబుల్ ఉద్యోగానికి పోటి పరిక్షలు రాశాడు అందులో 132 మార్కులు సాధించి సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపిక అయ్యారు. తల్లిదండ్రులు పడే కష్టాన్ని చూసి కసితో చదివి ఉద్యోగం సాధించానన్నారు. గంటాపురం గ్రామానికి చెందిన ఒసికేరప్ప యల్లమ్మ కుమారుడు కేశవయ్య 124 మార్కులు సాధించి ఏపీఎస్పీ కానిస్టేబుల్‌గా ఎంపికఅయ్యడు.



శ్రీకాంత్, దాసరి హరి, వినోద్, ఓంనాథ్, దేవేంద్రగౌడ్

తాడిమర్రి: రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన పోలీసు కానిస్టేబుల్ ఎంపిక పరీక్షా ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన ఐదుగురు ఉద్యోగాలు సాధించారు. దాసరి హరి 131 మార్కులతో సివిల్ కానిస్టేబుల్‌గా, శ్రీకాంత్ 129 మార్కులు, వినోద్119 మార్కులు, ఓంనాథ్ 119 మార్కులు, దేవేంద్రగౌడ్ 118 మార్కులతో ఏపీఎస్పీ కానిస్టేబుళ్లుగా ఉద్యోగానికి ఎంపికయ్యారు.



భరత్‌కుమార్

ధర్మవరం: పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ ఫలితాల్లో ధర్మవరం పట్టణం రజక కుటుంబానికి చెందిన ఓ యువకుడు ప్రతిభను చాటాడు. పట్టణంలోని కేశవనగర్‌కు చెందిన చంద్రశేఖర్, కాంతమ్మ కుమారుడు భరత్‌కుమార్ బీటెక్ పూర్తి చేశాడు. తల్లిదండ్రులప్రోత్సాహంతో ఇంటి వద్దే చదువుకుని పోలీసు ఎంపిక పరీక్షలో 124.5 మార్కులు సాధించి ఏపీఎస్పీ కానిస్టేబుల్‌ఉద్యోగానికి ఎంపికయ్యాడు.



సాయికృష్ణ

కొత్తచెరువు: మండల కేంద్రానికి చెందిన పీఎం సాయికృష్ణ పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. శుక్రవారం విడుదల చేసిన కానిస్టేబుల్ ఫలితాల్లో 137 మార్కులు సాధించాడు. పోలీస్ కావాలన్నదే తన ఆశయంగా పెట్టుకొని కష్టపడి చదివినందుకు ఈ రోజు కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడని తండ్రి నాగభూషణ తెలిపారు.



ఆర్థికసాయం

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన టీడీపీ వడ్డెర సంఘం నాయకులు దిగువపల్లి జెరిపిటి ప్రసాద్ కుటుంబానికి శుక్రవారం వడ్డెర సంఘం నాయకులు తమవంతు ఆర్థికసాయం అందించారు. బాధితకుటుంబ సభ్యులను పరామర్శించి తమవంతుగా రూ.16వేలు ఆర్థికసాయం అందించారు. వడ్డెర సంఘం అధ్యక్షులు ఇడగొట్టు ఆంజనేయులు, మంజునాథ్, కేశవ్, శ్రీనివాసులు, ఎంపీటీసీ శ్రీనివాసులు, అన్నదాత రాజు, మస్తానమ్మ, చలపతి, ఆంజనేయులు, జాకీర్ అహమ్మద్, బాలక్రిష్ణరెడ్డి, శీనా పాల్గొన్నారు.



టీడీపీ నాయకుడి కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న వడ్డెర సంఘం నాయకులు

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



మడకశిర రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయాల్లో అమ్మవార్లుకు ప్రత్యేక పూజలు జరిగాయి. మండలంలోని జమ్మానిపల్లిలోని లక్ష్మీనిడమామిడమ్మదేవి, మెళవాయి చౌడేశ్వరీదేవి అమ్మవారి ఆలయాల్లో ఉదయం నుంచి అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలను అర్చకులు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఆలయాలకు వెళ్లి అమ్మవారిని దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు.

గుడిబండ, (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన గుడిబండలో వెలసిన తుమ్మల మారెమ్మ అమ్మవారికి భక్తులు శ్రావణ శుక్రవారం సందర్భంగా పూజలు నిర్వహించారు. అమ్మవారు వెండి ఆభరణాలతో అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

బీసీ హాస్టల్ తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న బీసీ వెల్ఫేర్ అసిస్టెంట్

అమరాపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వలస బీసీ హాస్టల్‌ను వెల్ఫేర్ అసిస్టెంట్ గంగాధర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులను కొన్ని ప్రశ్నలను అడిగి సమాధానాలు రాబట్టారు. మెనూ మేరకు భోజనాన్ని వడ్డిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉన్నారా..? తదితర వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డెన్ వెంకటరమణ, సిబ్బంది నాగభూషణం వీరేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడ, విద్యాసామగ్రి పంపిణీ



విద్య, క్రీడా సామగ్రిని అందజేస్తున్న విదేశీ భక్తులు

గోరంట్ల, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు విదేశీయులు క్రీడా, విద్యాసామగ్రిని శుక్రవారం అందించారు. పుట్టపర్తి శ్రీసత్యసాయిబాబా శతజయంతి సందర్భంగా 150 మంది యూరప్ దేశస్థులు భజనమండలి ఆధ్వర్యంలో గోరంట్ల పాఠశాలను సందర్శించారు. ప్రతిఒకరు సత్యసాయిబాబా ఆశయాలతో తోటి మనిషికి సాయం చేయాలని, మంచి చదువులు చదివి ఉన్నత పదవులు అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. ప్రతి విద్యార్థికి పుస్తకాలు, పెన్ను, పెన్సిల్, ఏరైజర్, ప్యాడ్‌తోపాటు స్కిప్పింగ్‌రోప్. రింగ్, షటిల్‌బ్యాట్‌లను అందించారు. కార్యక్రమంలో సత్యసాయి భజన మండలి కోఆర్డినేటర్ విజయలక్ష్మీ, వెంకటశివారెడ్డి, సుబ్బరాయుడు, రత్నమయ్య, హెచ్‌ఎం మాలతి తదితరులు పాల్గొన్నారు.

బోర్డును తొలగించినవారిపై చర్యలు తీసుకోండి

జాతీయ రహదారిపై ప్రజాసంఘాల ఆందోళన



ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పెనుకొండ రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ బోర్డును తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు, దళితులు డిమాండ్ చేశారు. శుక్రవారం హరిపురం జాతీయరహదారిపై ప్రజాసంఘాల నాయకులు రోడ్డుపై ధర్నాచేసి బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ మండలంలోని కురుబవాండ్లపల్లి గ్రామంలో బీసీ కాలనీ నుంచి ఎస్సీకాలనీలోకి వెళ్లే రహదారిలో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ బోర్డును కొందరు తొలగించారని వారిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రోడ్డుపై ధర్నా చేయడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో వెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

బాగా చదివి తల్లిదండ్రులకు పేరు తేవాలి

● ఎంపీడీఓ వెంకటలక్ష్మి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

సోమందేపల్లి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): బాగా చదువుకుని తల్లిదండ్రులకు పేరుతేవాలని ఎంపీడీఓ వెంకటలక్ష్మి విద్యార్థులకు సూచించారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో నిర్మించిన టైప్-4 కేజీబీవీ హాస్టల్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంపీడీఓ అధ్యక్షత వహించి మాట్లాడారు. పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం హాస్టల్‌ను నిర్మించడం జరిగిందని వివరించారు. బాగా చదివి పేరుప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఆంజనేయులునాయక్, హెచ్‌ఎం జబీన, వార్డన్ లిఖిత, నాయకులు వెంకటరాముడు, డీవీ ఆంజనేయులు, కన్వీనర్ వెంకటేశులు, సిద్ధలింగప్ప, సూరీ, రామక్రిష్ణ, మద్దిలేటి సూర్యనారాయణ, చిన్నబాబయ్య గట్టు మహేంద్ర పాల్గొన్నారు.

రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాలు నాటవద్దు

- ఆర్‌అండ్‌బీ డీఈ

మడకశిర రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారుల పక్కన, మలుపులు ఉన్న ప్రదేశాల్లో అనుమతులు లేకుండా విద్యుత్ స్తంభాలు నాటవద్దని ఆర్‌అండ్‌బీ డీఈ లక్ష్మీనారాయణ, ఏఈ నరసింహామూర్తి శుక్రవారం తెలిపారు. రోడ్డుపక్కన స్తంభాలు ఏర్పాటు చేస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి అనుమతులు తీసుకున్న తరువాతనే ప్రధాన రోడ్ల పక్కన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలన్నారు. అనుమతులు లేకుండా విద్యుత్ స్తంభాలు నాటితే వాటిని తొలగిస్తామని హెచ్చరించారు.

పరిష్కారానికి నోచుకోని సమస్యలు

బస్ షెల్టర్, సులభ్ కాంప్లెక్స్‌లు లేక ఇక్కట్లు
బస్సుల కోసం రోడ్డుపై ప్రయాణికులకు తప్పని నిరీక్షణ
కౌన్సిల్ సమావేశంలో అభివృద్ధికి కీలక నిర్ణయాలు
పట్టణ వాసుల్లో చిగురిస్తున్న ఆశలు



వాల్మీకి సర్కిల్లో బస్సుల కోసం రోడ్డుపై వేచి ఉన్న ప్రయాణికులు

మడకశిర టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బస్టాండుల్లో కనీససౌకర్యాలు లేక ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. నగర పంచాయతీగా మారి ఏళ్లు గడుస్తోంది. పన్నుల రూపంలో రూ. లక్షల ఆదాయం నగర పంచాయతీకి వస్తోంది. అయినా బస్టాండుల్లో కనీససౌకర్యాలు కల్పించడంలేదన్న విమర్శలు స్థానికులు, ప్రయాణికుల నుంచి వస్తున్నాయి. ప్రధానంగా సులాబ్ కాంప్లెక్స్ లేక ప్రయాణికులు ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్ షెల్టర్లు లేక రోడ్డుపై నిరీక్షణ చేయాల్సి వస్తోంది. పట్టణంలో వాల్మీకి సర్కిల్, మధుగిరి రోడ్డులో సులబ్ కాంప్లెక్స్ ఉన్నా బస్‌షెల్టర్ లేక ఇబ్బందులు తప్పడం లేదు. హిందూపురం రోడ్డు, అమరాపురం రోడ్డు ప్రధాన బస్టాండులు నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటాయి. అయితే ఇక్కడ సులబ్ కాంప్లెక్స్‌లు, బస్‌షెల్టర్లు లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. వందలాదిమంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు గంటల తరబడి బస్సుల కోసం రోడ్డుపై వేచి చూడాల్సిన పరిస్థితి. మడకశిర నుంచి హిందూపురం, అమరాపురం, పెనుకొండ, అనంతపురం, కర్నూలు తదితర ప్రాంతాలతోపాటు సరిహద్దులోని కర్ణాటకకు సంబంధించి పావగడ, మధుగిరి, కొరటగెర, తుమకూరు, బెంగుళూరు తదితర ప్రాంతాలకు కూడా వెళ్తుంటారు. వందలాది మంది నిత్యం ప్రయాణాలు సాగిస్తున్నా కనీస సౌకర్యాలు కరువయ్యాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. రోడ్డుపైననే ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. నీడ లేక ఎండకు ఎండుతూ, వానలకుతడవాల్సిన పరిస్థితి ఉంది. వర్షం వస్తే విధిలేని పరిస్థితుల్లో హోటళ్లు, షాపుల వద్ద తలదాచుకోవాల్సిన దుర్భర పరిస్థితులు ఉన్నాయి. మడకశిర నగర పంచాయతీగా మారి ఏళ్లు గడుస్తున్నా ఎంతో మంది అధికారులు, ప్రజాప్రతినిధులు మారిన బస్టాండ్ల రూపురేఖలు మారడంలేదని అంటున్నారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో పలు ప్రణాళికలను రూపొందించారు. కొంతమేర పనులు సాగాయి. అయితే వైసీపీ ప్రభుత్వం ఏర్పడటంతో పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండిపోయాయి. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వంపోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రస్తుతం ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చురుగ్గా సాగుతున్నాయి. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి కొంత మంది వైసీపీ కౌన్సిలర్లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో మడకశిర నగర పంచాయతీ చైర్మన్ సైతం మారారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం మడకశిర నగర పంచాయతీ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో నగర పంచాయతీ అభివృద్ధికి సంబంధించి కీలక నిర్ణయలు తీసుకున్నారు. పట్టణ అభివృద్ధిపై చర్చించారు. దీంతో బస్టాండ్ల విషయంలో కూడా చర్చలు జరిపి ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని పట్టణవాసులు, ప్రయాణికులు కోరుతున్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి



బస్టాండుల్లో కనీససౌకర్యాలు కల్పించాలి. తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. సులబ్ కాంప్లెక్స్‌లు లేవు. వాటిని నిర్మించాలి. ప్రయాణికులు కనీసం కూర్చునేందుకు స్థలం లేదు. గంటల తరబడి రోడ్డుపై నిలబడి బస్సుల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ దిశగా నాయకులు చొరవ చూపి సౌకర్యాలు కల్పించాలి.

- చిక్కన్న, చీపులేటి

ధర్నాను విజయవంతం చేయండి

: యూటీఎఫ్



మాట్లాడుతున్న జిల్లా గౌరవ అధ్యక్షుడు భూతన్న

మడకశిర టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఫ్యాప్టో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కే.భూతన్న అన్నారు. శుక్రవారం పట్టణంలోని 4వ వార్డులో ప్రాథమికోన్నత పాఠశాలలో మడకశిర మండల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రం అయిన పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం ముందు శనివారం ఉదయం ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా ఉంటుందన్నారు. పీఆర్‌సీ కమీటిని వెంటనే వేయాలని, ఐఆర్ 40శాతం విడుదల చేయాలని, 4పెండింగ్ డీఏలను వెంట విడుదల చేయాలని, బోధనా పరమైన వృత్తిపరమైన సమస్యల పరిష్కారం చేయాలన్న డిమాండ్లతో ధర్నా నిర్వహించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి నరసింహప్ప, మండల అధ్యక్షులు మాలింగప్ప, ప్రధాన కార్యదర్శి జోగప్ప, నాయకులు మూడ్లగిరియప్ప, పి.ఓబన్న తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆరాధనోత్సవాలు

పెనుకొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కొండాపురం గ్రామంలోని లక్ష్మీకాంతతీర్థుల మఠంలో మూడు రోజులపాటు నిర్వహించిన ఆరాధనోత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. శుక్రవారం ఉత్తరారాధనలో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం బ్రాహ్మణ అన్నసంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో పాలూరి క్రిష్ణమూర్తి, బీహెచ్ శ్రీనివాసులు, అర్చకులు భాస్కరాచార్యులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ

పెనుకొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు బిగించరాదని విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ముద్రించిన కరపత్రాలు శుక్రవారం ఎన్టీఆర్ కాలనీలో సీపీఐ నాయకులు ఇంటింటికి వెళ్లి పంచిపెట్టారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు హరి, బాబావలి, తిప్పన్న, హబీబ్, పవన్, భాష, తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతులతో సమావేశం

హిందూపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం సందర్భంగా రైతుల ఖాతాలో నగదు జమచేయనున్నట్లు మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఉదయం 10గంటలకు హిందూపురం మార్కెట్‌యార్డ్‌లో అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభించే సందర్భంగా రైతులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 22మంది రైతులతో రూ.15కోట్లు వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున రైతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సమావేశానికి రండి: ఏఓ

రొద్దం, (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం నిధులను విడుదల చేస్తున్న సందర్భంగా శనివారం పెనుకొండలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని, అధికారులు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని వ్యవసాయశాఖ అధికారి రాజేష్ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 10 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు వర్చువల్‌గా కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు.

చైన్‌స్నాచింగ్ దొంగ దొరికాడు

హిందూపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రైలులో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడుతున్న నిందితుడిని అరెస్ట్‌చేసినట్లు రైల్వే ధర్మవరం సీఐ అశోక్‌కుమర్ తెలిపారు. శుక్రవారం రాత్రి హిందూపురం రైల్వే పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరాలను వెల్లడించారు. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వినోద్‌నాయక్ రైలులో ప్రయాణికులతో కలిసి ప్రయాణిస్తూ మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లేవాడన్నారు. శుక్రవారం సాయంత్రం హిందూపురం రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా అనుమానం వచ్చి అతడిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా రైలులో చైన్‌స్నాచింగ్‌కు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నాడన్నారు. అతడి నుంచి 75గ్రాములు బంగారం ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఇటీవల ధర్మవరం, హిందూపురం, కదిరి రైల్వే స్టేషన్ పరిధిలో మూడు రైళ్లలో చోరీకి పాల్పడ్డాడన్నారు. నిందితుడిని పట్టుకున్న ఎస్ఐ సజ్జప్ప, ధర్మవరం రైల్వే ఎస్ఐ రోహిత్‌గౌడ్, హిందూపురం ఆర్పీఎఫ్ సాయినాథ్‌రెడ్డి, సిబ్బందిని సీఐ అభినందించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి: సీఐ

పావగడ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తాలూకా వ్యాప్తంగా బ్యాంకులు, బంగారు దుకాణాలవద్ద నాణ్యమైన సీసీ కెమెరాలను అమర్చుకోవాలని, ఇది తప్పనిసరని సీఐ గిరీష్ సూచించారు. శుక్రవారం ఆయన బంగారు దుకాణదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇటీవల హిందూపురంలోని ఎస్‌బీఐ బ్యాంకులో జరిగిన సంఘటన నేపథ్యంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని పోలీసు స్టేషన్‌కు డీపీఆర్ లింక్ చేయాలన్నారు. సమావేశంలో ఎస్ఐ విజయ్‌కుమార్, కానిస్టేబుల్ దీపక్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

పెనుకొండ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పెనుకొండ మండలం ఎంఈఓ-1గా రాఘవయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన ఆయనను యూటీఎఫ్ నాయకులు సుధాకర్, నారాయణస్వామి, నబీ, హసీనాబేగంతోపాటు వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.



పింఛన్ పంపిణీ చేస్తున్న జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప

అర్హులకు పింఛన్ల పంపిణీ

టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప



శ్రీకంఠపురంలో పింఛన్ అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్

హిందూపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేస్తామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని కొల్లకుంటలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద వితంతు స్పౌస్ క్యాటగిరీకింద పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కూటమి ప్రభుత్వం ఎవరైనా భర్త చనిపోయిన వెంటనే అతని భార్య పేరుపై పింఛన్ ఇస్తున్నామన్నారు. అదేవిధంగా పట్టణంలోని 8వ వార్డులో మున్సిపల్ చైర్మన్ రమేష్, పట్టణాధ్యక్షులు వెంకటేశ్, నాయకులు మంగేష్, తిమ్మయ్య, కదిరప్ప, గిరి, గంగాధర్‌లు పింఛన్లు అందజేశారు. పూలకుంటలో సర్పంచ్ మంజునాథ్, ఎనిమిది మందికి కొత్త పింఛన్లు అందజేశారు. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా టీడీపీ నాయకులు పింఛన్లను పంపిణీ చేశారు.

పరిశుభ్రతే లక్ష్యంగా పనిచేద్దాం

కేంద్ర కార్పొరేషన్ కమిటీ సభ్యుడు



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సభ్యుడు

సోమందేపల్లి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిశుభ్రతే లక్ష్యంగా పనిచేద్దామని కేంద్ర కార్పొరేషన్ కమిటీ సభ్యులు రామాంజినేయులు సూచించారు. ఎస్ఎస్‌జి 2025 మిషన్‌లో భాగంగా గ్రామపంచాయతీల్లో చేపడుతున్న స్వచ్ఛ కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. అనంతరం నల్లగొంద్రాయనపల్లివద్ద చెత్తతో సంపద కేంద్రాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అంగన్‌వాడీ కేంద్రాన్ని, పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. డ్రైనేజీల నిర్వహణ పరిసరాల పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటలక్ష్మీ, ఆర్‌డబ్ల్యుఎఈ మహేశ్వర్‌రెడ్డి, డిస్ట్రిక్‌కోఆర్డినేటర్ సాయినాథ్, శ్రీనివాసులు, కార్యదర్శి రామాంజినేయులు సిబ్బంది పాల్గొన్నారు.

'కార్పొరేట్ సెలూన్ షాపును రానీయకండి'



వినతి పత్రం ఇస్తున్న నాయకులు

హిందూపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): హిందూపురంలో కార్పొరేట్ సెలూన్‌షాపు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీనిని అడ్డుకోవాలని నాయిబ్రాహ్మణ సేవా సంక్షేమ సంఘం నాయకులు కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో పీఏ బాలాజీకి వినతిపత్రం అందించారు. ఎలాగైనా హిందూపురంలో కార్పొరేట్ సెలూన్‌షాపులు ఏర్పాటు చేయకుండా చూడాలన్నారు. అదికానీ ఇక్కడ ఏర్పాటైతే మేము తరతరాలుగా నమ్ముకున్న నాయిబ్రాహ్మణ వృత్తిని వదులుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. మున్సిపల్ చైర్మన్ రమేష్‌కు వినతిని అందించారు.

కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపిక



తల్లిదండ్రులతో విజయ్‌కుమార్

రొద్దం, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): కందుకూర్లపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం కురుబ భాగ్యమ్మ, రాచర్లప్ప కుమారుడు విజయ్‌కుమార్ ప్రభుత్వం విడుదల చేసిన కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఐదేళ్లుగా పోటీపరీక్షలకు ప్రిపేర్ అవుతూ శుక్రవారం ప్రభుత్వం విడుదల చేసిన కానిస్టేబుల్ ఉద్యోగ ఫలితాల్లో విజయ్‌కుమార్ ఎంపికయ్యాడు. దీంతో తల్లిదండ్రుల ఆనందానికి అవధులులేకుండా పోయాయి. యువకుడు కానిస్టేబుల్ పరీక్షల్లో 139మార్కులతో 60వ ర్యాంకును సాధించాడు.

66వ ర్యాంక్ సాధించిన చంద్రశేఖర్



చంద్రశేఖర్

గోరంట్ల, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెడ్డివారి వీధికి చెందిన ఆటో డ్రైవర్ రవీంద్ర, అనిత దంపతుల కుమారుడు కురమాల చంద్రశేఖర్ శుక్ర వారం విడదలైన కానిస్టేబుల్ ఫలితాల్లో 139 మార్కులతో 66వర్యాంక్ సాధించారు. గతంలో తృటిలో ఉద్యోగం చేజారినా అధైర్యపడకుండా ఆత్మస్థైర్యంతో కష్టపడి చదివి తనకలను సాకారం చేసుకున్నారు. తమ కుమారుడు కానిస్టేబుల్‌గా ఎంపికకావడంపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

పెనుకొండ నుంచి ముగ్గురు



మోహన్‌కుమార్



శబరీరాజు

పెనుకొండ రూరల్, (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. బోయ మోహన్‌కుమార్ జిల్లాలో 5వ ర్యాంక్, ఇస్లాపురానికి చెందిన బోయ షబరిరాజు 63వ ర్యాంక్, కురుబవాండ్లపల్లికి చెందిన కురుబ మారుతి ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

పింఛన్‌కోసం అగచాట్లు



మంగాపురంలో సాయంత్రం 5గంటలైనా పింఛన్ ఇస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా పింఛన్ తీసుకునేందుకు ఆయా గ్రామాల్లోని వృద్ధులు, వికలాంగులు, వితంతువులు అగచాట్లు పడ్డారు. ఇటీవల సచివాలయ ఉద్యోగులు బదిలీ అయిన విషయం తెలిసిందే. గతంలో ఇంటింటికీ వెళ్లి అందించే పింఛన్‌ను నూతనంగా వచ్చిన ఉద్యోగులు గ్రామాల్లో ఒకేచోట కూర్చుని అందజేశారు. దీంతో పింఛన్‌దారులు అవస్థలు పడ్డారు. మంగాపురంలో సాయంత్రం 5గంటలు దాటినా పింఛన్ అందకపోవడంతో రోడ్డుపక్కన కూర్చుని నిరీక్షించాల్సిన పరిస్థితి తలెత్తింది.

సోలార్ లైట్ల ఏర్పాటుకు చర్యలు

పెనుకొండ టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో 14, 15, 16 వార్డుల్లో సోలార్ లైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు 15వ వార్డు ఇన్‌చార్జి బాబుల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలని నగర పంచాయతీ సిబ్బందితో కలిసి పరిశీలించారు.

'ఉపాధ్యాయుల పాత్ర కీలకం'

రొళ్ల, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేసి రాణించాలంటే ఉపాధ్యాయుల పాత్ర కీలకమని విశ్రాంత మండల విద్యాశాఖ అధికారి శివరామప్ప అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు రవికృష్ణ, యంజేరప్ప, మహదేవప్ప, రెడ్డప్ప, పాఠశాల కమిటీ అధ్యక్షులు నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ

పరిగి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీతారాంపురం కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు. సీడీపీఓ శాంతలక్ష్మీ ర్యాలీలో పాల్గొన్నారు. గర్భవతులు, బాలింతలకు తల్లిపాల విశిష్టత గురించి తెలిపారు. తల్లి బిడ్డకు పాలు ఇవ్వకపోవడంవల్ల క్యాన్సర్ వ్యాధి సోకే అవకాశాలున్నాయని సీడీపీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గోవిందరెడ్డి, సర్పంచ్ బాలాజీ, అంగనవాడీ సూపర్‌వైజర్ శంకరమ్మ, లలితమ్మ, శాసనకోట వెంకటేశ్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు సూర్యనారాయణ, గొరవనహళ్లి పాల్గొన్నారు. అదేవిధంగా హిందూపురం, సోమందేపల్లిలో వారోత్సవాలు జరిగాయి.

ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన

రొద్దం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రొప్పాల గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం స్థల పరిశీలన చేశారు. మంత్రి సవిత విగ్రహాన్ని ఏర్పాటుచేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు టీడీపీ మండల కన్వీనర్ నరహరి, శంకర్, రాము, వెంకటరాముడు, ఆదినారాయణ స్థలాన్ని పరిశీలన చేశారు.

ముందస్తు చర్యలు తీసుకోండి

● ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి

మడకశిర టౌన్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐనాయకులు కోరారు. పరిమితికి మించి విద్యార్థులను ప్రైవేట్ స్కూల్ బస్సులో ఎక్కిస్తున్నారని, కండీషన్‌లేని ప్రైవేట్ స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఈరేష్ అన్నారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ నాగేష్‌బాబును కలసి విద్యార్థులు, సంఘం నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ పరిమితికి మించి ప్రైవేట్ పాఠశాలల స్కూల్ బస్సులో ఎక్కిస్తున్నారని దీంతో ప్రమాదాలకు ఆస్కారం ఉందన్నారు. ప్రమాదాల జరగకుండా ముందుగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రైవేటు స్కూల్ బస్సులను తనిఖీ చేసి కండీషన్ లేని బస్సులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు దేవ, ఆశోక్, ముత్తహిర్ తదితరులు సీఐను కలిసిన వారిలో ఉన్నారు.


ఎంఈఓగా ప్రసాద్‌రెడ్డి

గుడిబండ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండల విద్యాధికారిగా ప్రసాద్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎంఈఓ-1 హిందూపురం ఎంఈఓ గంగప్ప ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించేవారు అయితే ప్రసాద్‌రెడ్డి ఎంఈఓ-1గా బాధ్యతలు స్వీకరించారు.

ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారిగా మధుసూదన్

పావగడ, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారిగా డాక్టర్ మధుసూదన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే వెంకటేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

గుండుమలలో టీడీపీ నాయకుల సంబరాలు



కేక్ కట్ చేస్తున్న నాయకులు

మడకశిర రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు గుండుమలకు వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా టీడీపీ నాయకులు శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చారన్నారు. ఈ సందర్భంగా వారు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.